తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్




గూడూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త : రాష్ట్రంలో చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి అన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఈ క్రమంలో జాబ్ మేళాలు నిర్వహించడం జరుగుతుందని చదువుకున్న యువత జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. గురువారం గూడూరు పట్టణంలోని దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో కలెక్టర్ వెంకటేశ్వర్, గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ పాల్గొన్నారు. గూడూరు పట్టణంలోని డి ఆర్ డబ్ల్యు కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాను తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రారంభించి ఎంపికైన అభ్యర్థులకు ఆఫర్ లెటర్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామని సమీపంలోని కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొని అర్హత కలిగిన అభ్యర్థులకు ఉపాధి కల్పిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు ప్రత్యేక శ్రద్ధతో జాబ్ మేళాలను నిర్వహించాలని సూచించారని తెలిపారు. అనంతరం గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ గూడూరు పట్టణంలోని డిఆర్‌డబ్ల్యు కళాశాలలో క్రమం తప్పకుండా జాబ్ మేళాలు నిర్వహిస్తూ అర్హత కలిగిన వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని అందుకు సహకరిస్తున్న కంపెనీలకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ జాబ్ మేళాకి 16 బహుళ జాతీయ కంపెనీలు జాబ్ మేళాకు హాజరు కాగా 414 మంది అభ్యర్థులు హాజరైయ్యారు. 278 మంది వివిధ కంపెనీలకు సెలెక్ట్ అవ్వడంతో, 44 మందిని షార్ట్ లిస్ట్ చేసారు. ఈ కార్యక్రమంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, గూడూరు డిఎస్పి గీతా కుమారి, డాక్టర్ జనార్దన్ రెడ్డి ఎలవర్తి విద్యా సాగర్ రావు, డి.ఆర్.డబ్ల్యు కళాశాల ప్రిన్సిపాల్ హనుమంత రావు. కంపెనీల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు కళాశాల యాజమాన్యం, తదితరులు పాల్గొన్నారు.

# 5 కోట్లతో బ్యారేజి,ఆయుకట్టు అభివృద్ధి ప్రతిపాదనలు

- పరిశీలించిన జిల్లా కలెక్టర్



స్వర్ణముఖి బ్యారేజ్‌ని పరిశీలిస్తున్న కలెక్టర్



వాకాడు, ఆగస్టు 21 ప్రభాతవార్త : స్వర్ణముఖి బ్యారేజీ, ఆయుకట్టు ఐదు కోట్ల రూపాయలతో అభివృద్ధి ప్రతిపాదనలను గురువారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. వాకాడులోని స్వర్ణముఖి బ్యారేజ్‌ని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ క్షుణ్ణంగా పరిశీలించారు. సంబంధించిన ఇరిగేషన్ శాఖ అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కు ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదన మేరకు బ్యారేజీ ఎత్తు నిర్మాణానికి సుమారు రెండు కోట్ల రూపాయలు అదేవిధంగా కెనాల్కు మూడు కోట్ల రూపాయలు కలిపి ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదికలు అందించామని తెలిపారు, ప్రతిపాదన మేరకు జిల్లా కలెక్టర్ బ్యారేజ్ ని క్షుణ్ణంగా పరిశీలించిన మేరాకు ప్రభుత్వానికి మంజూరు కొరకు కృషి చేస్తానని సంబంధించిన అధికారులకు, స్థానిక నేతలకు కలెక్టర్ తెలిపారు. వాకాడలో నూతనంగా కమ్యూనిటీ ఆరోగ్య ఆసుపత్రిని పరిశీలించి ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య అందుతుందా లేదా అని రోగులను వివరాలు అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు, రోగులు సానుకూలంగా కలెక్టర్ స్పందించారు. నాలుగు కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో స్థానిక సూపరిటెంట్ డాక్టర్ రోహిత్ జేమ్స్ ఆధ్వర్యంలో ఎక్స్రే ప్లాంటును జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. కొత్తగా నిర్మాణం చేపట్టిన ఆసుపత్రిని పరిశీలించగా టెక్నీషియన్ ల్యాబ్ టెక్నీషియన్లు పనితీరుపై మెరుగుపరుచుకోవాలని సంబంధించిన వైద్య అధికారికి కలెక్టర్ సూచించారు. ఆస్పత్రి భవనం ముందు వైద్య సిబ్బందితో ప్రతి ఒక్కరు పనితీరు మార్చుకోవాలని కలెక్టర్ హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా ఇరిగేషన్ అధికారి రాధాకృష్ణమూర్తి, ఈఈ బాబు, ఇరిగేషన్ డి చంద్రశేఖర్, డిప్యూటీ తాసిల్దార్ రఫీ, ఎంపీడీవో శ్రీనివాసులు, టిడిపి మండల కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, ఆయుకట్టు ప్రెసిడెంట్ తిరుమూరు శ్రీనివాసుల రెడ్డి, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు, పిఆర్‌ఏఈ కిరణ్, ఎస్సై నాగబాబు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సుమాంజలి, ఏ ఓ దీప, ఏపీవో విజయ, టిడిపి నాయకులు మండల ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, ద్వారకానాథ్ రెడ్డి, వేణు నాయుడు, వివిధ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి

- ఎన్‌పిఎస్ మహిళా డిగ్రీ కళాశాలలో బిసీ హాస్టల్ నిర్మాణానికి కలెక్టర్ ఎమ్మెల్యే



బిసీ బాలికల హాస్టల్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

చిత్తూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త: ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి పరుగులు పెడుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు అన్నారు. చిత్తూరు ఎన్‌పిఎస్ సావిత్రమ్మ డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం ప్రభుత్వ బిసీ బాలికల హాస్టల్ భవన నిర్మాణానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌తో కలిసి శంకుస్థాపన, భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో సావిత్రమ్మ డిగ్రీ కళాశాలలో అదనపు సౌకర్యాలు కల్పించడం జరుగుతున్నదని, ఇందులో భాగంగా విద్యార్థులకు ఉపయోగకరంగా వుండేలా బాలికల బిసీ హాస్టల్ నిర్మాణం జరుగుతున్నదన్నారు. ప్రభుత్వ రంగంలో నాణ్యమైన మౌళిక సదుపాయాల కల్పన మరింత జరుగాల్సి వున్నారు. తల్లిదండ్రులకు, విద్యార్థులకు ఎన్‌పిసి సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలపై గల విశ్వాసంతో ఈ ఆర్థిక సంవత్సరంలో 200లకు పైగా విద్యార్థులు కళాశాలలో చేరారన్నారు. పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే కఠోరశ్ర అవసరం అన్నారు. సామాజిక మాధ్యమాల వినియోగానికి బానిసలు కాకుండా వాటిని అవసరమైన మేరకు ఉపయోగించుకోవాలని, లేకుంటే విద్యార్థుల సమయం వృధా అవుతుందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ ప్రైవేటు రంగంలోని దాతలు ముందుకు వచ్చి చిత్తూరులో ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రభుత్వ బిసీ బాలికల వసతి గృహం భవన నిర్మాణం చేపట్టడం శుభపరిణామమన్నారు. ప్రపంచానికి వెలుగునిచ్చేది చదువు, జ్ఞానం అని నమ్మిన కలెక్టర్ ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మించనున్న బిసీ బాలికల వసతి గృహ నిర్మాణానికి అనుమతుల మంజూరులో చొరవ చూపడంతో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నామన్నారు. బిసీ బాలికల హాస్టల్ నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎన్‌పి వెంకటేశ్వరచౌదరి, విజయం విద్యాసంస్థల అధినేత డాక్టర్ తేజోమూర్తి తదితరులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కళాశాలలో విద్యను అభ్యసించిన అత్యధిక విద్యార్థులు ఉన్నత శిఖరాలకు వెళ్ళారని, ప్రస్తుతం కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు శ్రమించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కళాశాలను విద్యార్థులు తమ జీవితాలను బంగారు మయంగా మార్చుకునే ప్రయోగశాలగా భావించాలన్నారు. ఈ సమావేశంలో చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్యే ఎన్‌పి వెంకటేశ్వరచౌదరి, దాతలు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యానికి యంత్రాలను వాడండి

మున్సిపాలిటి,దేవస్థానం, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో పని చేయాలి : ఎమ్మెల్యే సుధీర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఏ

శ్రీకాళహస్తి,ఆగస్టు 21 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పురపాలకసంఘానికి రావాల్సిన పన్నుల బకాయిలు సుమారు రూ.10కోట్లు పేరుకుపోయాయని మున్సిపల్ కార్యాలయం అధ్వాన్నంగా ఉందని శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసారు.గురువారం మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం రూ.3.9కోట్లు స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల రూ.3కోట్లు, శ్రీకాళహస్తీశ్వరాలయ దేవస్థానం రూ.70లక్షలు బకాయిలు ఉన్నాయని వాటిని వెంటనే వసూలు చేయాలన్నారు. పట్టణంలో పలు సమస్యలు చోటు చేసుకున్నాయని వాటిని వర్షాకాలానికి ముందే పరిష్కరించాలని ఎంఎల్ఏ కమిషనర్‌కు సూచించారు.ముఖ్యంగా ప్రాజెక్టు వీధిలో ఒకటి రెండు ఇళ్ళ ఆక్రమణలతో వర్షాకాలమే కాకుండా మురుగునీటి కాలువల్లో నీరు పారక ఇబ్బందులు పడుతున్నారని ఎంఎల్ఏ అభిప్రాయపడ్డారు. కొండమిట్ట, ఎన్‌టిఆర్ నగర్‌లలో రోడ్ల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు. మున్సిపాలిటి దేవస్థానం సమన్వయంతో పని చేయాలన్నారు. కొండ పై భాగంలో రోడ్డు ఏర్పాటు చేసి అస్తవ్యస్తంగా ఉన్న పైపు లైన్లను సరిదిద్దాలని సూచించారు.

**నాలుగుశాఖలు సమన్వయంతో పని చేస్తే సమస్యలే ఉండవు:**

పరిపాలనలో నాలుగు శాఖలు సమన్వయంతోపని చేస్తే సమస్యలే ఉండవని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. మున్సిపాలిటి,దేవస్థానం, రెవెన్యూ, పోలీసుశాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ఉందన్నారు. పట్టణంలోని పాత వదరయ్యపాళెం రోడ్డును సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుటకు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు ఆదేశించారు. ఆర్‌టిసి బస్టాండు నుంచి పట్టణ సరిహద్దుల వరకు సిమెంటు రోడ్డు పక్కన మట్టి రోడ్డు ఉందని దానిని వెడల్పు చేయటానికి చర్యలు తీసుకోవాలని ఇక్కడ డివైడర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.రాబోవు రోజుల్లో నిపుణులచే ప్రత్యేక సర్వేజరిపి చర్యలు తీసుకుంటామన్నారు. చెంబేడు కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలన్నారు. శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయానికి వస్తే కార్పొరేట్ స్థాయిలో ఉండాలన్నారు. ఒక్క కమిషనర్ ఛాంబర్‌మాత్రం సకల హంగులతో ఉండగా ఇతర ఛాంబర్లు కిటికీల్లేవు, కనీసం ఫ్యాన్లు సక్రమంగా తిరగటం లేదు.ఈ దుస్థితి ఉండరాదన్నారు. పారిశుద్ధ్యానికి సంబంధించి తోపుడు బ ండ్లు లేదని,ట్రాక్టర్ల పరిస్థితి బాగాలేదని కార్మికులు వివరించారు. పాత కాలం నాటి పద్దతులకు స్వస్తి చెప్పి సాంకేతికంగా వ్యవహారించాలన్నారు.

**కొత్త బస్‌స్టాండ్‌కు ప్రతిపాదన:**

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం రూపు రేఖలు మరో రెండేళ్ళలో పూర్తిగా మారిపోతుందని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి వివరించారు. రాజీవ్‌నగర్‌లో మరో పది రోజుల్లో ప్రక్షాళన మొదలౌతుందన్నారు. ఒక్కొరికి ఒక్క ఇల్లే ఉంటుందన్నారు.టిడ్కోలో 2018లో కేటాయించినట్లే ఇళ్ళరాస్‌ను అందిస్తామన్నారు.మధ్యలో వైకాపా నాయకులు లబ్దిదారులను తప్పుదారి పట్టించారని ఆ నిర్ణయాలు అమలు జరగవని సుధీర్‌రెడ్డి అన్నారు. ఆర్‌టిసి బస్టాండును బసవయ్యపాళెం సమీపంలో ఏర్పాటుకు స్థల సేకరణకు ఆదేశించామన్నారు. విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్, తెలుగుదేశం నాయకులు రావిళ్ళ మునిరాజానాయుడు, రంగినేని చెంచయ్యనాయుడు, జి.విజయ కుమార్, కాసరం రమేష్, పోలూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 30న చిత్తూరుకు మంత్రుల కమిటీ రాక

- జిల్లాల పునర్విభజనపై క్షేత్రస్థాయి పరిశీలన !!

కుప్పం, ఆగస్టు 21 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేపట్టాలని నిర్ణయించి అందుకోసం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ నేతృత్వంలో మంత్రుల సబ్ కమిటీని ఏర్పాటుచేసిన విషయం విదితమే. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో జిల్లాల పునర్విభజన అంశాన్ని పరిశీలించి తుది నిర్ణయాన్ని డిసెంబర్ నెలలోగా పూర్తి చేయాలని నిశ్చయించింది. ఈ నేపథ్యంలో మంత్రుల సబ్ కమిటీ జిల్లాల పర్యటనకు సిద్ధమైంది. ఈనెల 30వతేది కమిటీలోని మంత్రులు నిమ్మల రామానాయుడు,సత్యకుమార్‌ల బృందం చిత్తూరులో పర్యటించనున్నట్లు సమాచారం. అదే రోజు మంత్రుల బృందం కడప జిల్లా, నెల్లూరులో సైతం పర్యటించనున్నట్లు తెలిసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాను గత వైఎస్సార్సీ ప్రభుత్వం వేర్వేరు జిల్లాలుగా విభజించిన విషయం విదితమే. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో చిత్తూరు జిల్లాకు ఏడు నియోజకవర్గాలు, తిరుపతి జిల్లాకు, అన్నమయ్య జిల్లాకు 3 నియోజకవర్గాలు విభజించారు. తిరుపతి జిల్లా పరిధిలోకి నెల్లూరు జిల్లాలోని గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాలు చేరాయి.

ఇదిలా ఉండగా జిల్లాల విభజనపై అప్పట్లోనే ప్రజలనుంచి అభ్యంతరాలు వచ్చాయి. అయితే వైఎస్సార్సీ ప్రభుత్వం తదనంతరం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో అధికారంలో వచ్చిన కూటమి ప్రభుత్వం దృష్టికి జిల్లాల పునర్విభజన వ్యవహారాన్ని పలువురు తీసుకెళ్లారు. దీంతో సిఎం చంద్రబాబునాయుడు వైఎస్సార్సీ హయాంలో జరిగిన జిల్లాల పునర్విభజన హేతుబద్ధంగా లేదని భావించి మరోమారు జిల్లాలను పునర్విభజించాలని నిర్ణయించారు. ఈ అంశాన్ని కొలిక్కి తెచ్చేందుకు పలువురు కేబినెట్ మంత్రులతో కూడిన సబ్ కమిటీని నియమించారు. ఇప్పటికే జిల్లాల విభజనపై మంత్రుల కమిటీకి పలు నివేదికలు అందగా వాటిని పరిశీలించిన మంత్రుల కమిటీ నేరుగా జిల్లాల్లోకే వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించింది. దీంతో ఈనెల 30న చిత్తూరుకు మంత్రుల కమిటీ రానుంది.

# అందరి కళ్ళు ఆ దాతపైనే !

**బంగారుదేవుడికి 121కిలోల బంగారు ఆభరణాలిచ్చే భక్తుడి కోసం ఎదురుచూపు**



ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

ప్రపంచంలోనే అత్యంత సంపన్నవంతమైన దేవుడుగా ...సుమారు 5,300 కోట్లరూపాయలు వార్షిక ఆదాయం వచ్చే హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం ఖ్యాతిచెందింది. బంగారు దేవుడుగా దేవదేవుని అలంకరణలకు 1,100 వజ్రవైడూర్యాలు కలిగిన స్వర్ణాభరణాలు రోజుకు 120 కిలోల ఆభరణాలను ధరించే శ్రీవేంకటేశ్వరస్వామికి ఓ హిందూ భక్తుడు,దేవునిపట్ల అత్యంత విశ్వాసం కలిగిన దాత ఏకంగా 121 కిలోల బంగారం విరాళంగా ఇవ్వనున్నారని స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించడం ఇప్పుడు దేశవిదేశాల్లో ఉన్న శ్రీవారి భక్తుల్లో చర్చనీయాంశంగా మారింది. అంతటి భక్తిభావం కలిగిన ఆ దాత భక్తుడు ఎవరనేది శ్రీవారిభక్తుల మదిలో కలరవపెడుతోంది, ఏడుకొండల దేవుని భక్తుడు ఒకరు కంపెనీ పెట్టారని, అది ఊహించిన స్థాయికంటే ఎక్కువగా అభివృద్ధి చెంది లాభాలు చేకూరింది. కంపెనీలో 60శాతం వాటా విక్రయిస్తే 1.5బిలియన్ ఆరువేలకోట్ల రూపాయలు డబ్బులు వచ్చాయి. దీంతో ఆ దేవుని దయ ఆశీస్సులతోనే ఇదంతా వచ్చిందని. తనవంతుగా ఆ దేవునిపై భక్తి విశ్వాసాలతో 121 కిలోల బంగారంను స్వామివారికి విరాళంగా ఇవ్వనున్నారని సిఎం తెలియజేయడం ఇప్పుడు తిరుపతి, తిరుమలలోనేగాక ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తుల్లో హాట్‌టాపిక్‌గా మారింది. అయితే ఆ భక్తుడు ఎవరనేది మాత్రం తెలిసే అవకాశం లేదు. ఆయన అత్యంత గోప్యంగా ఈ విషయాన్ని ఉంచడం మరో విశేషం. ఇప్పటికే ధార్మికసంస్థ టిటిడికి రోజువారీగా కోటీశ్వరులు, పారిశ్రామికవేత్తలు, ఉన్నతస్థాయి ధనవంతులు తమ స్థాయిలో అనేక ట్రస్ట్‌లకు, పథకాలకు విరాళాలందజేస్తున్నారు. ఇందులో ఇప్పటికే 2,500 వేల కోట్ల రూపాయలుపైగా ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్, 2వేల కోట్లరూపాయలు వరకు శ్రీవాణి ట్రస్ట్ నిధులు చేకూరాయి. ఇక ఎస్వీప్రాణదానం, గోసంరక్షణ ట్రస్ట్‌కు ,బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని, సర్వశ్రేయస్సు ట్రస్ట్‌కు ఇలా వరుసగా తమ వంతుగా దాతలు దేవునిపై భక్తితో భారీ మొత్తంలో విరాళాలందిస్తున్నారు. అత్యధికంగా కోటిరూపాయలు,ఆపై వరకే దాతలు విరాళాలిస్తున్నారు. ఇప్పుడు ఏకంగా అతిత్వరలో ఓ దాత ఏకంగా 121కిలోల బంగారుం 140కోట్ల రూపాయలు విలువగా తెలుస్తోంది. బంగారుదేవుడు కలియుగవైకుంఠవాసుడు మరింతగా ఆయురారోగ్యాలు ప్రసాదించాలని భక్తలోకం అభిమతం.

# గాలిలో దీపంలో విద్యార్థులు చదువులు



పెళ్లకూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త : మండలంలో పెళ్లకూరు లో స్థానికంగా ఉన్న ప్రాథమిక ఉన్నత పాఠశాల నందు ఉపాధ్యాయులకొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 120 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు (సోషియల్, మాథ్స్) తప్ప మిగతా సబ్జెక్ట్సకి ఉపాధ్యాయులు లేరు. దీంతో విద్యార్థులు ఏం చేయాలో తెలియక దిక్కుతోచని పరిస్థితుల్లో ఉపాధ్యాయుల కోసం ఎదురుచూస్తున్నారు. కూలి నాలి చేసుకునే పేదవారు తమ బిడ్డలు తమలా కాకుండా మంచి చదువులు చదువుకుని గొప్ప జీవితాన్ని అనుభవించాలని కార్పోరేట్ స్కూల్స్ లో చదివించే స్తోమత లేక ప్రభుత్వ బడులలో చేర్పిస్తే ఇక్కడ తమ బిడ్డలు ఉపాధ్యాయుల కొరతతో పడే ఇబ్బందులు చూసి మధనపడుతున్నారు. ఈ కూటమి ప్రభుత్వంలో నాయకులు విద్యార్థుల చదువుల విషయంలో ఏమాత్రం రాజీ పడే ప్రసక్తే లేదని ప్రవేట్ స్కూల్స్ కంటే దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దుతామంటూ గొప్పలు చెబుతుంటే స్కూల్స్ ప్రారంభమై ఏడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఉపాధ్యాయులను భర్తీ చేయకపోవడం విచారకరం. 10వ తరగతి చదివే విద్యార్థులకు పబ్లిక్ ఎగ్జామ్స్ దగ్గర పడుతుండడంతో ఉపాధ్యాయుల కొరతతో సిలబస్ పూర్తికాక పిల్లలు బాధపడుతుంటే తల్లిదండ్రులు తమ బిడ్డల భవిష్యత్తును గురించి ఆలోచిస్తూ మొదలు పడుతున్నారు. ఈ విషయంపై పాఠశాల ప్రధానోపాధ్యా యులను వివరణ కోరగా సమస్యను జిల్లా ఉన్నత విద్యాశాఖ అధికారులు దృష్టికి తీసుకెళ్లామని వారు త్వరలోనే సమస్యకు పరిష్కారం చూపిస్తామని ఇప్పుడు జరుగుతున్న డీఎస్సీ ఉపాధ్యాయుల నియామకాల ద్వారా పరిష్కారం అవుతుందని అన్నారని తెలిపారు.

# భక్తి శ్రద్ధలతో చవితిని నిర్వహించుకుందాం

**- నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి- నిర్దేశించిన మార్గాల్లోనే విగ్రహాలను తీసుకెళ్లాలి - డి.జె.లు, సినిమా పాటలు, అశ్లీల నృత్యాల ప్రదర్శనలు బంద్- కమిషనర్ ఎన్.మౌర్య**



తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 21 ప్రభాతవార్త : వినాయక చవితిని భక్తి శ్రద్ధలతో బ్రహ్మాండంగా నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని, వినాయక సాగర్‌లో నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను నగరపాలక సంస్థ కమిషనర్ అధికారులను ఆదేశించారు. నగరంలో వినాయక చవితి నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, వరసిద్ధి వినాయక నిమజ్జన కమిటీ సభ్యులతో కమిషనర్ సమావేశమై సమీక్షించారు. వినాయక చవితి, నిమజ్జనంలో ఆయా విభాగాల అధికారులు చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అందరూ భక్తి శ్రద్ధలతో వినాయక చవితి నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని అన్నారు. నగరంలో విగ్రహాలు ఏర్పాటు చేసేవారికి అన్ని అనుమతులు పొందేందుకు సింగిల్ విండో సిస్టమ్ ఏర్పాటు చేశామని, తద్వారా త్వరగా అనుమతులు పొందవచ్చునని అన్నారు. ఇక విగ్రహాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల నుండి వినాయక సాగర్‌కు వెళ్ళే మార్గాల రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఆయా మార్గాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అన్నారు. విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఇబ్బంది లేకుండా పాండ్‌లో నీరు నింపాలని, ర్యాంప్ ఏర్పాటు చేయాలని నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. అలాగే ప్రజలకు త్రాగునీరు అందుబాటులో ఉంచాలని అన్నారు. విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు క్రేన్లు ఏర్పాటు చేయాలని అన్నారు. పరిసర ప్రాంతాలను ఏపటికప్పుడు శుభ్రం చేయించాలని శానిటరీ అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా ఎక్కువ వెలుగులు వచ్చేలా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఎస్పిడిసిఎల్ అధికారులకు సూచించారు. అరటి మాన్లు, మామిడి తోరణాలు, తదితర అలంకరణలు, డివైడర్లు ఏర్పాటు చేయాలని టిటిడి అధికారులకు సూచించారు. బోట్లు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని ఫైర్, మత్స్య శాఖ అధికారులను ఆదేశించారు. నిమజ్జనం రోజు మద్యం దుకాణాలు మూసి వేసేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు సూచించారు. మండపాల వద్ద సినిమా పాటలు, అశ్లీల నృత్యాల ప్రదర్శనలు లేకుండా చూడాలని అన్నారు. ఊరేగింపులో డీజే సౌండ్లు లేకుండా చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. విగ్రహాలు తీసుకెళ్లే మార్గంలో చెట్లు, విద్యుత్ వైర్లు అడ్డం లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. 108 వాహనాలను అందుబాటులో ఉంచుకోవాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఆయా విభాగాల అధికారులు గతంలో జరిగిన నిమజ్జన ఏర్పాట్లను దృష్టిలో ఉంచుకుని అందరూ కలసి కట్టుగా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, కార్పొరేటర్ నరసింహ ఆచారి, అర్బన్ డెవలప్మెంట్ బోర్డు మెంబర్ విజయకుమార్, ఏఎస్పీ మనోహర ఆచారి, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, ఎస్పిడిసిఎల్ ఎస్.ఈ. సురేంద్ర నాయుడు, తుడా సెక్రటరీ డాక్టర్ శ్రీకాంత్, ఈ.ఈ.రవీంద్ర, డి.సి.పి.ఖాన్, డిఎస్పీ లు భక్తవత్సలం, రామకృష్ణ ఆచారి, తహసీల్దార్ సురేష్ బాబు, ఫైర్, ఆర్టీసీ, మత్స్యశాఖ, టూరిజం శాఖ, వరసిద్ధి వినాయక నిమజ్జన కమిటీ సభ్యులు సామంచి శ్రీనివాస్, గుండాల గోపి, తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే భానుప్రకాశ్ బేటీ : నగరి అభివృద్ధిపై చర్చ



పుత్తూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త : నగరి నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును గురువారం అమరావతి సచివాలయంలో కలిసి చర్చించారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు తగినన్ని నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో నగరిలో జరిగిన బహిరంగ సభలో మరమగ్గ కార్మికులకు ఇచ్చిన నెలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీని నెరవేర్చినందుకు నియోజకవర్గ ప్రజల తరపున ఆయన సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నగరి నియోజకవర్గంలోని మొత్తం అయిదు మండలాల్లో వడమాలపేట, పుత్తూరు తిరుపతి జిల్లాలోనూ, నగరి, నింద్ర, విజయపురం మండలాలు చిత్తూరు జిల్లాలో వుండడం వల్ల పరిపాలనా సౌలభ్యానికి ఇబ్బందిగా వుందని తెలిపారు. నియోజకవర్గం ప్రజలకు దగ్గరగా వుండే తిరుపతి జిల్లాలో నగరి, నింద్ర, విజయపురం మండలాలను కలపాలని కోరారు. విజయపురం మండలంలోని కోసలనగరం పారిశ్రామిక కేంద్రం అభివృద్ధికి చర్యలు తీసుకుని యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. గాలేరు -నగరి ప్రాజెక్టుకు సంబంధించి పుత్తూరు రూరల్ మండల పరిధిలో అసంపూర్తిగా వున్న వేణుగోపాల సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయాలన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న ప్రభుత్వ కార్యక్రమాల అమలు, పార్టీ సంస్థాగత ఎన్నికల కమిటీలు, సుపరిపాలన, తొలి అడుగు కార్యక్రమాల అమలు తీరుపై ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద వచ్చిన విజ్ఞప్తులను సిఎంకు అందించారు. నగరి నియోజకవర్గం అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే భానుప్రకాశ్ తెలిపారు.

# కాలువలు, ప్రభుత్వ భూముల ఆక్రమణ!



చెరువు పక్కనే ఆక్రమణలకు గురౌతున్న దృశ్యం

తొట్టంబేడు,ఆగస్టు 21 ప్రభాతవార్త : తొట్టంబేడు మండలం శ్రీకాళహస్తి పట్టణానికి చేరువలో ఉంది.ఈ మండలంలోని కొంత ప్రాంతాన్ని మున్సిపాలిటిలో కలపటానికి ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. పట్టణానికి అనుకొని తొట్టంబేడు మండలం ఉంది. ఇందులో ఈదుల గుంట, రామచంద్రాపురం, ఎల్‌ఐసి కాలనీ, రాజీవ్‌నగర్, జగనన్న కాలనీలు, బసవయ్య పాళెం ఉన్నాయి. ఎస్‌డికె నగర్ రోడ్డుకు పడమర వైపు శ్రీకాళహస్తి మున్సిపాలిటి అయితే తూర్పున తొట్టంబేడు మండలం ఉంది.ఇక్కడ విలువైన కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములున్నాయి.ఇప్పటికే చెరువు పరాధీనమైంది. చెరువు లోతట్టు కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ పబ్బం గడుపుకుంటున్నారు. మండలంలోని స్వర్ణముఖి నది నుంచి విచ్చల విడిగా ఇసుకను దోచేస్తున్నారు. అయితే అధికారులు ఎంతో ప్రశాంతంగా తమకు ఫిర్యాదులు అందలేదంటూ సమాధానం చెబుతారు. చెరువుల్లో మట్టిని విచ్చల విడిగా తోడేస్తున్నారు.కానీ అధికారులు అలా జరుగుతుందా? అంటూ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసారు.విచ్చల విడిగా గంజాయి అమ్మకాలు కానీ దొరికితే దొంగలు లేకుంటే దొరలన్నట్లు మారింది. ఇక జగనన్న కాలనీ అంతా గందరగోళమే. కానీ ఇవేమి రెవెన్యూశాఖకు ఫిర్యాదులు అందవు. దాని మీద వారు స్పందించరు. ఇలా ప్రభుత్వానికి సంబంధించిన భూములు విచ్చల విడిగా పరాధీనం అయి అమ్మకాలు జరుగుతుంటే అధికారులు మాకేమీ తెలియదన్నట్లు వ్యవహారిస్తున్నారు.

**ఈదుల గుంటను చదును చేసేస్తున్నారు . . .**

శ్రీకాళహస్తికి సమీపంలో ఎస్‌ఐసి కాలనీకి సమీపంలో ఈదుల గుంట చెరువు ఉంది. దాని సమీపంలోనే బంగారమ్మ గుంట ఈ చెరువు కాలువలను ఆక్రమిం చుకొని కొందరు పేదలు ఇళ్ళు నిర్మించుకున్నారు. వారి గుడిసెలను తొలగించుటకు గత పాలకులు ప్రణాళికలు రూపొందించుకొని ముందడుగు వేసారు.అయితే జనం తిరుగుబాటుతో ముందడుగు వేయలేక పోయారు. ప్రస్తుతం ఈదుల గుంటకు తూర్పున కొందరు జెసిబిలు ఏర్పాటు చేసుకొని మూసి వేస్తున్నారు. అయితే రెవెన్యూ అధికారులకు కానీ ఇరిగేషన్ అధికారులు తమకు ఫిర్యాదులు అందలేదు మాకెందుకు? అన్నట్లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహారిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను పలుకుబడి కల్గిన వారు తమ ఇష్టారాజ్యంగా ఆక్రమించుకొనుటకు పావులు కదుపుతుంటే అధికారులు ప్రేక్షక పాత్ర వహించటం చర్చనీయాంశంగా మారింది. మరి ఇక్కడ పరిపాలనను గాడిన పడేయటానికి ప్రస్తుత శాసనసభ్యుడు కొత్త టీం (అధికారులను) నియమించుకున్నారు, కానీ మార్పు లేదు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



చౌడేపల్లి, ఆగస్టు 21 ప్రభాతవార్త రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. చౌడేపల్లి-బోయకొండ ప్రధాన రహదారిలో చౌడేపల్లి వైపు వస్తున్న టూవీలర్‌ను ఎదురుగా వస్తున్న కారు ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందున్న బిసి కాలనీకి సమీపంలో ఢీకొన్నది. ఈ ప్రమాదంలో మండలంలోని కాగతి పంచాయతీ పెద్దూరుకు చెందిన చక్రపాణి(27)కి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ అతన్ని స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇక్కడ చక్రపాణి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అదే వాహనంలో పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందిన వైద్యులు ధృవీకరించారు. మృతుడి భార్య హేమలత ఆశాకార్యకర్తగా పనిచేస్తోంది. ఇద్దరు చిన్నారులున్నారు. పోషకుడు మృతి చెందడంతో వీధిన కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఆసుత్రిలో శ్రీమంతాలు చూతము రారొండోయ్...!



చౌడేపల్లి, ఆగస్టు 21 ప్రభాతవార్త వైద్య వృత్తిని పక్కనబెట్టి అమ్మగా అవతారమెత్తింది వైద్యాధికారిణి మోనా...ఆసుపత్రిలో పనిచేస్తూ ప్రజలకు సేవలందించిన మహిళలకు శ్రీమంతాలు చేసి గొప్పగా వీడ్కోలు పలికింది...స్థానిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తూ ఇతర ప్రాంతాలకు 10మంది సిబ్బంది బదిలీ అయ్యారు. బదిలీలు సర్వ సాదారణం అనుకొన్నారు. అయితే ఏళ్ళతరబడి సేవలందించిన సిబ్బందిని ఘనంగా సన్మానించాలనుకొన్నది వైద్యాధికారిని మోనా. సిబ్బందిలో కొందరు మహిళలు గర్భవతులుగా వుండటంతో ఆమె వారందరికీ శ్రీమంతాలు చేసి సాగనంపింది. దీంతో ఆసుపత్రిలో ఎన్నడూ లేనివిధంగా నూతన ఒరవడికి నాంది పలికిందని మోనా స్థానికులు అభినందించారు. అదే విధంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఐదుగురిని సన్మానించారు.

## హుండీ ద్వారా రూ. 4.13లక్షల ఆదాయం



చౌడేపల్లి, ఆగస్టు 21 ప్రభాతవార్త సత్యప్రమాణాలకు పేరుగాంచిన రాజనాలబండకు హుండీ లెక్కింపు ద్వారా రూ. 4,13,240లు ఆదాయంగా సమకూరిందని టిటిడి సూపరిండెంట్ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. ఇటీవల రాజనాలబండ తిరుణాళ్ళు జరిగిన దరిమిలా హుండీ లెక్కింపును నిర్వహించారు. టిటిడి అధికారులు శ్రీహర్ష, భానుప్రకాష్, కృష్ణమూర్తి, రాజేష్, టిటిడి సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్త విధానాలు శాపంగా ఉంది : ఎపిటిఎఫ్



శ్రీకాళహస్తి,ఆగస్టు 21 ప్రభాతవార్త: విద్యావ్యవస్థలో మూల్యాంకన పుస్తకాల విధానం మార్పు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎపిటిఎఫ్ అభిప్రాయపడింది. ఈ మేరకు యూనియన్ తరపున తిరుపతి జిల్లా విద్యాశాఖా ధికారి కే.వీ.యన్ కుమార్‌కు వినతి పత్రం అందించినట్లు వివరించారు. గురువారం వినతి పత్రం అందించిన ఎపిటిఎఫ్ నాయకులు పాతశాలల్లో మూల్యాంకన పుస్తకాలు విద్యార్థులకు సరఫరా చేయుట అనే కొత్త విధానం ఉపాధ్యాయులకు కొత్త సమస్యలను తెచ్చిపెడుతున్నాయి. ఈ విధానం పాతశాల పనివేళల్లో జరగాల్సిన బోధనా సమయాన్ని హరించి వేస్తుందని ఉపాధ్యాయ నాయకులు వివరించారు. గతంలో పరీక్ష పేపర్లు ఇంటి వద్ద దిద్దే పద్దతికి బదులు పాతశాలలో పుస్తకాలను ఇంటికి తీసుకెళ్ళలేని పరిస్తితి చోటు చేసుకుందన్నారు. దీంతో పాతశాలలో మూల్యాంకనం చేయాల్సి వస్తుందన్నారు.మార్కుల నమోదు కూడా ఉపాధ్యాయులకు పని భారంగా పరిణమించిందన్నారు. ఇప్పటికే ఆన్‌లైన్లో నమోదు,రిజిస్టర్ నమోదు తో పాటు ఇప్పుడు జబ్లింగ్ చేసే పని కూడా ఉపాధ్యాయులకు సంక్రించిందన్నారు. ఆన్‌లైన్ విధానం నమోదుకు మాత్రమే పరిమితమై మిగిలిన నమోదు నుంచి వెసులుబాటు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరినట్లు వివరించారు.ఈ మేరకు అధ్యక్షులు బి.మురళీ కృష్ణ ప్రధాన కార్యదర్శి బి.బాలసుబ్రమణ్యం, గౌరవ సలహాదారు ఎస్ వెంకటముని, జిల్లా ఉపాధ్యాక్షుడు డివి మదన్‌మోహన్, జిల్లా నాయకుడు చంద్రశేఖర్ తొట్టంబేడు మండల అధ్యక్షులు రామదారు, ఉపాధ్యాక్షులు పెరుమాళ్ళు తదితరులు పాల్గొన్నారు.

## రాస్‌చే ఉచిత బ్యూటిషియన్ కోర్సు ప్రారంభం



శ్రీకాళహస్తి,ఆగస్టు 21 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలోని రాస్ సారధ్యంలో ఉచిత బ్యూటిషియన్ కోర్సు ను గురువారం ప్రారంభించారు. పట్టణంలోని పానగల్‌లో గల రాస్‌మహిళా వాణి కార్యాలయం నందు గురువారం రాస్ జనశిక్షణా సంస్థాన్ అధ్వర్యంలో కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. సంస్థాన్ డైరెక్టర్ డాక్టర్ ఎం.మోహన్ హాజరయ్యారు.ఈ సందర్బంగా ఆయ న మాట్లాడుతూ జేయస్‌యస్ ద్వారా ప్రతి ఏడాది 90 బ్యాచులకు వృత్తి శిక్షణలను ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. ఈ శిక్షణ సంస్థాన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, మీనా, రాస్ ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేశ్, వినోద్, ముఖేష్, షబనా, మీనా, రాజశేఖర్ పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## పరశురామేశ్వరుని సన్నిధిలో సోషల్ కమిషనర్



శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 21 ప్రభాతవార్త : ఏర్పేడు మండలంలోని గుడిమల్లం ఆలయానికి అతిథుల తాకిడి రోజు రోజుకు పెరుగుతుంది. తిరుపతి నుంచి చక్కటి రహదారులు వేయటంతో ఆలయానికి ప్రాధాన్యత పెరుగుతుంది.ఈ నేపధ్యంలో గురువారం ఆలయంలో వెలసిన ఆనందవల్లి సమేత పరశురామేశ్వ రాలయంలో సోషల్ వెల్ఫేర్ కమిషనర్ లావణ్యావాణి కుటుంబసభ్యులతో కలసి దర్శించుకున్నారు.వారికి ఆలయ మర్యాదలతో ఆలయ ఇఓ రామచంద్రారెడ్డి స్వాగతం పలికారు. ఆమెకు ఆలయ ప్రాశస్త్యంను వివరించారు. పురావస్తుశాఖ పర్యవేక్షణలో ఉన్న ఆలయానికి సంబంధించిన విశిష్టతను వివరిస్తూ ఇక్కడ అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి సంబంధించి వివరించారు. వారితో పాటు డెప్యూటీ కలెక్టర్ విక్రమ్ కుమార్‌రెడ్డి ఉన్నారు.

## బండారుపల్లిలో చెరువుగా మారుతున్న ప్రధాన వీధి



శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 21 ప్రభాతవార్త : ఏర్పేడు మండలంలోని ప్రధాన పంచాయతీల్లో సమస్యలు తిష్టవేసి ప్రజల్ని బాధలకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా మండలంలో అత్యధిక ఓటర్లున్న పంచాయతీల్లో బండారు పల్లి ఒకటి. ఇక్కడ సుమారు 3వేలకు పైగా ఓట్లున్నాయి. ఈ గ్రామం నుంచి గతంలో మండలాధ్యక్షుడు ఎన్నికయ్యారు. ప్రస్తుతం తెలుగుదేశంలో అధిష్టానానికి సన్నిహితంగా మెలిగే నాయకుడున్నారు. బాలకృష్ణను రప్పించుకున్న నాయకుడు ఉంటున్న గ్రామంలో వీధుల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. చినుకు పడితే గ్రామస్తులు ఇళ్ళ నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేదు. ముఖ్యంగా ప్రధాన వీధులు చినుకు పడితే చెరువుగా మారుతుంది. ఈ సమస్య ఈ రోజుకు ఈ రోజు ఉద్భవించింది కాదు. కొన్ని సంవత్సరాలుగా వస్తుంది. కూటమి ప్రభుత్వం వచ్చి 15నెలలు దాటింది. ఈ సమస్యపై నాయకులు ఎందుకు స్పందించటం లేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఒక సారి వర్షం పడితే వారం రోజుల వరకు బండారుపల్లి వీధుల్లో కాలు పెట్టలేము. అధికార పార్టీ పట్టించుకోదు. ప్రతి పక్షం నోరుమెదపదు.

## సిడిసిఏ మాజీ కార్యదర్శి వేణుగోపాల్ నాయుడు మృతి



తిరుపతి క్రీడ, ఆగస్టు 21 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి గాలి వేణుగోపాల్ నాయుడు అనారోగ్యం కారణంగా గురువారం మృతి చెందారు. శుక్రవారం మధ్యాహ్నం దేవేంద్ర థియేటర్ సమీపంలో గల హరిశ్చంద్ర స్మశాన వాటిక నందు దహన క్రియలు నిర్వహించనున్నారు. ఆయన జిల్లా క్రికెట్ అసోసియేషన్ లో దాదాపు 12 సంవత్సరాల పాటు అనేక సేవలు అందించడమే కాక, క్రికెట్ అభివృద్ధికి ఎంతో దోహదపడ్డారు. వేణుగోపాల్ నాయుడు ఆకస్మికంగా మరణానికి పలువురు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ, చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు విజయ్ కుమార్, సిడిసిఏ కార్యదర్శి రవి, కోశాధికారి గిరి ప్రకాష్, ఉపాధ్యక్షులు శ్రీనివాసమూర్తి, శ్రీధర్, జాయింట్ సెక్రెటరీ సతీష్ యాదవ్, సభ్యులు మురళి యాదవ్, కోలా హరిప్రసాద్, దివాకర్, రవి, మార్కండేయులు, సత్య శ్రీనివాస్, గాలి వేణుగోపాల్ నాయుడు, శివప్రసాద్, రమణ, ప్రకాష్, కోచ్‌లు సునీల్, చిన్నబాబు, అనిత, చంద్రిక, సీనియర్ క్రికెటర్ అంపైర్ సుదర్శన్, పలువురు క్రికెట్ క్రీడాకారులు ఆయనకు నివాళులర్పించారు.

## మాస్టర్ ప్లాన్ రోడ్లను పరిశీలించిన కమిషనర్ ఎన్.మౌర్య

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 21, ప్రభాతవార్త నగరపాలక సంస్థ పరిధిలోని గోదా దేవి మార్గంలో భూమి.కోల్పోయిన వారి స్థలాలను గురువారం సాయంత్రం కమిషనర్ ఎన్.మౌర్య పరిశీలించారు. మాస్టర్ ప్లాన్ రోడ్లలో భూములు కోల్పోయిన వారికి టిడిఆర్ బాండ్లు మంజూరుకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు బుధవారం ఆన్లైన్ ద్వారా అధికారులు దరఖాస్తులను పరిశీలించారు. అందులో భాగంగా గురువారం సాయంత్రం కమిషనర్ ఎన్.మౌర్య పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కలసి గోదాదేవిమార్గంలోని10దరఖాస్తులనుక్షేత్రస్థాయిలోస్థలాలను పరిశీలించారు. కమిషనర్ వెంట కార్పొరేటర్ రాధా రెడ్డి, డీసీపీ ఖాన్, ఎసిపి మూర్తి, సర్వేయర్ కోటేశ్వర రావు, టిపిఎస్ వంశీ, తదితరులు ఉన్నారు.

## 24న వెంకయ్యస్వామి ఆరాధన

శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 21 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన వెంకయ్య స్వామి ఆలయంలో ఈ నెల 24న ఆరాధనోత్స వాలను నిర్వహించుటకుసన్నాహాలు చేస్తున్నారు.26వ ఆరాధనోత్స వాలను ఘనంగా నిర్వహించుటకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఆలయానికి దాతల సహకారంతో ఉత్సవాలు నిర్వహించటం ఆనవాయితిగా వస్తుంది.ఈ నేపధ్యంలో 24 ఆదివారం ఉదయం హోమాలు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. రాత్రి పల్లకి సేవ,భక్తి పారాయణం నిర్వహిస్తామన్నారు. రాత్రి 9గంటలకు పల్లకి సేవ నిర్వహిస్తామన్నారు.

## కాణిపాకం ఆలయంలో ఆర్జెసీ విస్తృత తనిఖీలు



కాణిపాకం, ఆగస్టు 21 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో దేవాదాయశాఖ తిరుపతి ఆర్జెసీ చంద్రశేఖర్ ఆజాద్ గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా దేవస్థానం లడ్డూపోటు నందు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈసందర్బంగా లడ్డూ పోటులో సరుకుల నాణ్యతను,లడ్డూ,వడ,పులిహోర ప్రసాదాల నాణ్యతను పరిశీలించారు. అలాగే అన్నదాన భవన్‌లో భక్తులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను ఆయన పరిశీలించారు.భక్తులకు శుచి,శుభ్రతతో కూడిన నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు.దేవస్థానం డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు,ఏఈఓలు ప్రసాద్, హరిమాధవంరెడ్డి,దనుంజయ, ఆలయ సూపరెండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం బ్రహ్మోత్సవాలకు పలువురు ప్రముఖులకు ఆహ్వానం



కాణిపాకం,ఆగస్టు 21 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగునున్న వార్షిక బ్రహ్మోత్స వాలకు పలువురు ప్రముఖ ులను ఆహ్వానిస్తూ గురువారం ఆలయ అధికారులు ఆహ్వానపత్రికలను అందజేశారు. ఈమేరకు జిల్లా జడ్జి అరుణసారిక, జిల్లా ఎస్పీ మణికంఠచందోలు,జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ఇతర జిల్లా ముఖ్య అధికారులను ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్,అర్చకులు వేర్వేరుగా కలసి స్వామివారివార్షిక బ్రహ్మోత్స వాలకు ఆహ్వానిస్తూ ఆహ్వానపత్రికలను అందజేశారు.ఈసందర్భంగా స్వామివారి ప్రసాదాలను,శేషవస్త్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, వేదపండితులు పాల్గొన్నారు.

## కంగుందిని పర్యాటక ప్రాంతంగా మార్చుతాం - ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం



కుప్పం, ఆగస్టు 21 ప్రభాతవార్త సుమారు వెయ్యేళ్ల చరిత్రకు సాక్ష్యమైన కంగుంది దుర్గం, ప్రాంతాన్ని సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. గురువారం ఆయన కంగుంది గ్రామంలోని దుర్గ ం, పురాతన ఆలయాలు, రహదారి మార్గాలు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం ప్రాంత చరిత్ర, స ంస్కృతి ప్రతిబింబించేలా ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కోట చుట్టూ రోడ్లు, పార్కింగ్, విద్యుద్దీకరణ, సుందరీకరణ వంటి పనులపై చర్చించారు. కంగుంది ప్రాంతంలోని ఆలయాలను సైతం అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్,సర్పంచ్ ధనశేఖర్, నేతలు దివాకర్, విసి మంజునాథ్, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఐటిఐలో చేరికలకు దరఖాస్తులు

శాంతిపురం, ఆగస్టు 21 ప్రభాతవార్త

స్థానిక ప్రభుత్వ ఐటిఐ కాలేజ్‌లో ప్రదేశాలకు గాను ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 26వతేది లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శేషారెడ్డి కోరారు. దరఖాస్తులను అభ్యర్థులు ఈనెల 27వతేది సాయంత్రం 5గంటల్లోగా ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఐటిఐ కళాశాల కార్యాలయంలో ధృవీకరించుకోవాలన్నారు. 29వతేది కళాశాలలోనే కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఘనంగా శ్రీకృష్ణుడి విగ్రహం ఊరేగింపు



కుప్పం, ఆగస్టు 21ప్రభాతవార్త ఇందూజ్ఞానవేదిక కుప్పం శాఖ అధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా కుప్పం ప్యాలస్ వద్ద కొలువు చేయించిన శ్రీకృష్ణపరమాత్ముడి విగ్రహాన్ని గురువారం పురవీధుల్లో ఊరేగించారు. ఆరు రోజులపాటు రోజూ స్వామివారికి పూజలు, భగవద్గీత పారాయణ ం నిర్వహించారు. ఊరేగింపు కార్యక్రమంకు ముఖ్యఅతిథిగా మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్ హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కృష్ణ, కృష్ణారెడ్డి, ప్రకాష్, శరవణ, నాగరాజు, దేవరాజు, కృష్ణ, చరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డిఎస్సీలో ప్రతిభ చూపిన విద్యార్థికి సత్కారం

కుప్పం, ఆగస్టు 21 ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మెగా డిఎస్సీ పరీక్ష ల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన పైపాళ్యంకు చెందిన ప్రదీప్‌ను మాజీ సర ్పంచ్ వల్లెప్ప అధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పైపాళ్యం గ్రామానికి చెంది న త్యాగరాజు,హరితల కుమారుడు అయిన ప్రదీప్ డిఎస్సీ పరీక్షల్లో గణిత విభాగంలో 93.7శాతం స్కోరు సాధించాడు. దీంతో పైపాళ్యం హైస్కూల్‌లో అతన్ని సత్కరించారు. ఈసందర్బంగా వల్లెప్ప మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన ప్రదీప్ ఉత్తమ ప్రతిభ చూపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సికె మణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వి.కోటలో హిందు..ముస్లిం సోదరుల శాంతి ర్యాలీ

వి.కోట, ఆగస్టు 21 ప్రభాతవార్త



హిందు, ముస్లిం సోదరులు వి.కోట పట్టణంలో హిందు ముస్లిం భాయ్‌భాయ్ అనే నినాదాలు చేస్తూ శాంతిర్యాలీ నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ఈ ర్యాలీ జరిగింది. స్థానిక అంబేద్కర్ సర్కిల్‌నుంచి కుప్పం రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. అన్ని పండగలను అందరూ కలసికట్టుగా జరుపుకుంటామని వి.కోట మండలం దేశంలోనే ఆదర్శం కావాలని కోరుకుంటున్నట్లు మత పెద్దలు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఉదయ్ సంతోష్, ఎంపిడిఓ ఈశ్వరన్, సిఐ సోమశేఖర్‌రెడ్డి, నేతలు రామచంద్రనాయుడు, రంగనాథ్, నారాయణస్వామి, సోమశేఖర్, శబరీష్ పాల్గొన్నారు.

## ఎయిర్‌పోర్టు భూముల రైతుల్ని ఆదుకుంటాం - ఆర్డీఓ శ్రీనివాసులురాజు

రామకుప్పం, ఆగస్టు 21 ప్రభాతవార్త



మండలంలో నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణంకు భూములు ఇస్తున్న రైతులను ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటామని కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు రాజు పేర్కొన్నారు. గురువారం కిలాక్‌పోడు, కడచిన కుప్పం, మణీంద్రం గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలతో గ్రామసభ నిర్వహించారు. సిఎం చంద్రబాబునాయుడు కుప్పం ప్రాంత అభి వృద్ధికి ఎయిర్‌పోర్టును తీసుకువస్తున్నారన్నారు. దీంతో పాటు స్థానికంగా పరిశ్రమలు స్థాపించి నిరు ద్యోగులకు ఉపాధి, రైతుల పంటల ఎగుమతులతో వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. భూ ములు కోల్పోయే రైతులకు నష్టపరిహారం దశలవారీగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. అలాగే అర్హులకు నివాస గృహాలు సైతం అందిస్తామన్నారు. సమావేశంలో తహశీ ల్దార్ కౌలేష్, నేతలు మునస్వామి, పత్ర నారాయణ, రామూర్తి, శ్రీనివాస్లులురెడ్డి, గుర్రప్ప, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య చర్యలు సమర్థవంతంగా నిర్వహించాలి

జిల్లా పంచాయితీ అధికారి సుధాకర్ రావు



కల్లూరు, ఆగస్టు 21, ప్రభాతవార్త ప్రస్తుతం వర్షాకాలం కావడంతో అంటు వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పారిశుద్ధ్య చర్యలు సమర్థవంతంగా చేపట్టాలని చిత్తూరు జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావు అన్నారు. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీని గురువారం జిల్లా పంచాయతీ అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి, సేంద్రియ ఎరువు తయారీపై వివరాలు ఆరా తీశారు. పారిశుద్ధ్య సిబ్బంది తెల్లవారి నుంచి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఎక్కడ నిర్లక్ష్యం వద్దని అన్నారు. అనంతరం స్వచ్ఛభారత్ పై పలు సూచనలు చేశారు. డిపిఓ వెంటడిప్యూటీఎంపీడీవో హరి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, జూనియర్ అసిస్టెంట్ కిరణ్ ఉన్నారు.

## స్త్రీ శక్తి పథకం అమలు పై హర్షం



కల్లూరు, ఆగస్టు 21, ప్రభాతవార్త పుంగనూరు నియోజకవర్గ పులిచెర్ల మండలంలో కూటమి ప్రభుత్వం పాలనలో సూపర్ సిక్స్‌లో భాగంగా స్త్రీ శక్తి పథకం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌కు ధన్య వాదములు తెలుపుతూ సంబరాలు చేసుకున్నారు. సింగల్ విండో ఛైర్మన్ లెక్కల ధనంజయ నాయుడు టిడిపి నాయకులు, కుమార్ రెడ్డి, రవి నాయుడు, గోపి నాయుడు, మహేష్, హరినాథ్, జనసేన పార్టీ మండల అధ్యక్షులు మీసాల చంద్రబాబు, ఏఎంసీ డైరెక్టర్ కుమార్ రాయల్, ప్రధాన కార్యదర్శి మనోహర్ రాయల్, మధు రాయల్, హరి, భూపతి మునిశేఖర్, వెంకట్, భీమవరం చైతన్య,పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

సోమల ఆగస్టు 21, ప్రభాతవార్త ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ అన్నారు. సోమల మండలం అన్నమ్మగారిపల్లి పంచాయతీ రెడ్డివారి పల్లి ఎస్టీ కాలనీలో ఉచిత వైద్య శిబిరాన్ని డాక్టర్ బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ సూరిబాబు మాట్లాడుతూ అడవుల్లో నివసిస్తారని వారు దోమల బారిన పడకుండా చర్యలు తీసుకుంటే మలేరియా లాంటి వ్యాధుల బాధ పడకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ఎంపీడీవో నారాయణ మాట్లాడుతూ పారిశుద్ధ పనులు ముమ్మరం చేయాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వైద్యవిద్యలో స్వీయ అభ్యాసం కీలకం

- ఏఐఎంఎస్ఆర్ అసోసియేట్ డీన్ రమ్యారమకృష్ణన్



చిత్తూరురూరల్, ఆగస్టు 21 ప్రభాతవార్త: భవిష్యత్తులో వైద్యరంగంలో సమర్థవంతంగా నిలదొక్కుకోవాలంటే విద్యార్థులు కేవలం తరగతి గదుల బోధనకే పరిమితం కాకుండా స్వయంగా జ్ఞానం ఆర్జించే అలవాటు పెంపొందించుకోవాలని ఏఐఎంఎస్ఆర్ అసోసియేట్ డీన్ రమ్యారమకృష్ణన్ పేర్కొన్నారు. వైద్యవిద్యలో బోధన, అభ్యాస పద్ధతులను మెరుగుపరిచే లక్ష్యంతో చిత్తూరులోని అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్‌లో మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం సెల్ఫ్ డైరెక్టడ్ లర్నింగ్ ప్రాముఖ్యతపై నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను డీన్ రమ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. వైద్యవృత్తి నిరంతర అభ్యాస యాత్ర అని, ప్రతి వైద్యుడు తాజా శాస్త్రీయ పరిణామాలు, కొత్త చికిత్సా విధానలు, కరికులంలో జరుగుతున్న మార్పులు తెలుసుకొంటూ తన జ్ఞానాన్ని నవీకరించుకోవాలన్నారు. అలాగే రీసోర్స్‌పర్సన్, అనాటమీ ప్రొఫెసర్ కరికులం కమిటీ సభ్యురాలు డా.పద్మావతి మాట్లాడుతూ స్వీయ అభ్యాసం విద్యార్థులకు మాత్రమే కాక, అధ్యాపకులకు కూడా తమ సమస్యలను స్వయంగా పరిష్కరించుకొనే ధైర్యం ఇస్తుందని, కొత్త విషయాలను అన్వేషించే ఉత్సాహాన్ని పెంపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎంఎస్ఆర్ ఫార్మకాలజీ విభాగాధిపతి డా. సచ్చిదానంద అడిగ, స్టూడెంట్స్ అఫైర్స్ ఆఫీసర్ డా. శ్రావణ దీప్తి, ది అపోలో యూనివర్శిటీ హెల్త్‌సైన్సెస్ అధ్యాపకులు పాల్గొన్నారు.

## చవితి కొలువులకు అనుమతి తప్పనిసరి

పుంగనూరు రూరల్, ఆగస్టు 21, ప్రభాతవార్త



వినాయక చవితి వేడుకలలో గణేశ్ విగ్రహాలు ప్రతిష్టించేవారు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, పోలీస్ అనుమతులు పొందాలని పుంగనూరు సీఐ సుబ్బారాయుడు తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పండుగను ప్రశాంతంగా నిర్వహించే దిశగా నిర్వాహకులు చొరవ చూపాలని సూచించారు. విగ్రహ ప్రతిష్టకు అనుమతులు పొందేందుకు ఆన్లైన్ ద్వారా కూడా దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిబంధనలు పాటించాల్సిన అవసరం ఉందని, పోలీసు విభాగం తరఫున అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు.

## ఐటిఐ కోర్సులకు దరఖాస్తు చేయండి

పుంగనూరు రూరల్ 21, ప్రభాతవార్త



ప్రభుత్వ ఐటీఐలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సివిల్, డీజిల్ మెకానిక్ కోర్సులతో పాటు మహిళల కోసం ప్రత్యేకంగా ఫ్యాషన్ డిజైనింగ్ అండ్ టెక్నాలజీ కోర్సులో కూడా సీట్లు అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తు చేసిన విద్యార్థులు ఈ నెల 26న కళాశాలలో సర్టిఫికెట్లను వెరిఫికేషన్ కోసం హాజరు కావాలని ఆయన తెలియజేశారు. ఐటీఐలో చేరడం ద్వారా టెక్నికల్ విద్యలో నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ఉద్యోగ అవకాశాలను సులభంగా పొందవచ్చని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. స్థానిక యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## గణేష్ పండుగ కోసం మాట్లాడుకుందాం రండి

పుంగనూరు, ఆగస్టు 21, ప్రభాతవార్త

ముందస్తు వినాయక చవితి పండగను నిర్వహణపై శనివారం సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు త్రిమూర్తి రెడ్డి తెలిపారు. మినీ బైపాస్ జె ఎం డి కళ్యాణ మండపంలో మన ఊరిలో వినాయక పండుగ ఎటువంటి ఆటంకాలు లేకుండా నిర్విఘ్నంగా ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆనందోత్సాహాల మధ్య పండుగ జరుపుకొనుటకు పుంగనూరులోని అన్ని ప్రభుత్వ అధికార విభాగాలు అధికార యంత్రాంగం మొత్తము కలిసి ఒకే వేదిక పైన సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది కావున ప్రతి ఒక్క వినాయక మండపం నుంచి వినాయక విగ్రహాలు నెలకొల్పే కమిటీ వారు తప్పక పాల్గొని మీ అమూల్యమైన సలహాలు సూచనలు తెలియజేసి అలాగే అధికారులు ఇచ్చే అమూల్యమైన సలహాలు సూచనలు తీసుకొని ప్రభుత్వ నియమ నిబంధనలు తూచా తప్పక పాటిస్తూ మన గణనాధుని పండుగ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు.

## గిరిజన సమస్యలు పరిష్కరించాలి

సదుం, ఆగస్టు 21, ప్రభాతవార్త



మండల పరిధిలోనే గిరిజన కుటుంబాలకు సమస్యలను పరిష్కరించాలని ఏపీ గిరిజన సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కే హరి శివప్ప అన్నారు. గురువారం ఎపి. గిరిజన సంక్షేమ సేవ సంఘం ఆధ్వర్యంలో సదుం మండల తాసిల్దార్‌ను కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో దాదాపు 30 కుటుంబాల గిరిజనులు నివశిస్తున్నారనీ వారందరికి స్థిర ఇంటి స్థలాలతో పాటు పట్టాలి ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా తాసిల్దార్ ప్రమీల స్పందించి పది రోజుల్లోపు మీ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజర్ ప్రసాదరావు, అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీ కె. భాను ప్రకాష్, వైస్ ప్రెసిడెంట్ కె.శంకర ,కె.కళావతి మహిళా విభాగం వైస్ ప్రెసిడెంట్, ఎస్. భాను ఆర్గనైజర్ సెక్రెటరీ మహిళా విభాగం ఇతర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ దృక్పథం అలవరచుకోవాలి

జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి యుగంధర్‌బాబు



పలమనేరు టౌన్, ఆగస్టు 21, ప్రభాతవార్త: ప్రజలు శాస్త్రీయ దృక్పథం అలవరచుకోవాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మిఠాయి యుగంధర్‌బాబు పిలుపునిచ్చారు. స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మూఢనమ్మకాలు, చేతబడి, బాణామతి వంటి వాటిని నిషేదించే చట్టాలు అమలుచేయాలన్నారు. మహారాష్ట్రలో మూఢవిశ్వాసాల తొలగింపు కోసం కృషి చేస్తూ హత్యకు గురైన నరేంద్ర దబోల్కర్‌కు నివాలర్పిసూ దేశ వ్యాప్తంగా నేషనల్ సైంటిఫిక్‌డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా అధ్యక్షుడు ఆరుణ్‌శివప్రసాద్‌చే గణిత అష్టావదానం నిర్వహించారు. 8 మంది పృచ్చకులు అడిగే క్లిష్టమైన గణిత ప్రశ్నలకు అవధాని అబ్బుర పరచే సమాధానాలతో ఆకట్టు కున్నారు. పాఠశాలప్రిన్సి పాల్‌ప్రశాంతిశ్రీపురంసీతారామయ్య,అధ్యాపకులుకృష్ణవేణి, రామక్రిష్ణ పాల్గొన్నారు.

## మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు

పలమనేరు ఆగస్టు 21, ప్రభాతవార్త:

మాస శివరాత్రి సందర్భంగా గురువారం పలమనేరు సమీపంలోని మన్నారునాయనిపల్లె వద్ద వెలసిన నిర్వాణవేదనారాయణ స్వామి గుడిలో ప్రత్యేక పూజలు జరిగాయి. పవళించి వున్న స్వామి వారికి వేదపండితులు పూలు పండ్లు సుగంధ ద్రవ్యాలతో పూజలు అభిషేకాలు చేశారు.101 బిందెలతో పసుపు నీళ్ళతో స్వామివారికి జలాభిషేకం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై టెంకాయ కర్పూరాలు, హారతులు సమర్పించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

## నేడు ఓటర్లజాబితాపై అవగాహన

పలమనేరు, ఆగస్టు 21, ప్రభాతవార్త:

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల22 న మధ్యాహ్నం 3.30 గంటలకు ఓటర్ల జాబితా తయారుపై అవగాహ సదస్సు నిర్వహిస్తున్నట్లు పలమనేరు నియోజకవర్గం ఓటర్ల నమోదు అధికారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పలమనేరు రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో జరిగే వివిధరాజకీయపార్టీలప్రతినిధులు,ప్రింట్‌ఎలక్ట్రానిక్‌మీడియా ప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

## క్యాటిల్‌ఫామ్‌వద్ద వాహనాల తనిఖీ

పలమనేరు టౌన్, ఆగస్టు 21, ప్రభాతవార్త: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పలమనేరు సమీపంలోని క్యాటిల్‌ఫామ్ బ్రిడ్జి వద్ద బుధవారం రాత్రి ఎస్ఐ లోకేష్‌రెడ్డి తన సిబ్బందితో వాహనాల తనఖీ నిర్వహించారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలకు జరిమానాలు విధించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్లు, నాలుగుచక్రాలవాహనదారులు సీటుబెల్టులు ధరించాలని లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## గణనాధుని సన్నిధిలో సుప్రీంకోర్టు జడ్జి



కాపాకం,ఆగస్టు 21 ప్రభాతవార్త: సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ కరోల్ గురువారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు.ఆలయ దర్శ నా ర్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ కె.పెంచల కషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. అలాగే శ్రీవీరాం జనేయస్వామి ఆలయం,నవగ్రహ ఆలయంలలో కూడా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు వేదమండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను,ప్రసాదాలను అందజేశారు. సుప్రీంకోర్టు జడ్జి వెంట చిత్తూరు జిల్లా జడ్జి అరుణసారిక,ఆలయ ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి,ప్రసాద్, ఐరాల తహశీల్దార్ లోకేశ్వరి, ఆలయ సూపరిండెంట్ కోదండపాణి,చిత్తూరు రూరల్ సీఐ శ్రీధర్ నాయుడు,కాణిపాకం ఎస్సై నరసింహులు. చిత్తూరు కోర్టు సిబ్బంది, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి : సిఐ

రామకుప్పం, ఆగస్టు 21 ప్రభాతవార్త :



సమాజంలో ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కుప్పం గ్రామీణ సిఐ మల్లేష్ యాదవ్ పేర్కొన్నారు. విజలాపురంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు బానిస కారాదని సూచించారు. ప్రజలు నాటుసారా, గంజాయి, మద్యం, ఇతర మత్తు పదార్థాలకు దూర ంగా ఉండాలని ఇందుకు ప్రజలు పోలీసులతో భాగస్వామ్యం కావాలని కోరారు. అనంతరం గ్రామంలో సిసి కెమెరాలు ప్రారంభించారు. ఎస్సై వెంకటమోహన్, ట్రైనీ ఎస్సై మధుసూధన్, నేతలు మునస్వామి, పట్రనారాయణ, రామూర్తి, గుర్రప్ప, వెంకటరామగౌడు, శ్రీనివాసులు రెడ్డి, కుమార్, కృష్ణారెడ్డి, భువన్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

## తిరుమల పవిత్రతను భ్రష్టు పట్టించిన వైకాపా

చిత్తూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త:



తిరుపతి-తిరుమల దేవస్థానం ప్రతిష్టను వైకాపా ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్ ధ్వజమెత్తారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో వున్నా, ప్రతిపక్షంలో వున్నా తిరుమల ప్రతిష్ట గురించి ప్రస్తుతం మాజీ టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడటం చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు వుందన్నారు. శ్రీవారిని నల్ల రాయితో పోల్చిన భూమన కరుణాకర్‌రెడ్డి గోశాల, గోవిందుడి గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. అలాగే శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో సతీసమేతంగా పాల్గొని పట్టు వస్త్రాలు సమర్పించని ఏకైక వ్యక్తి మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. కరుణాకర్‌రెడ్డి టిటిడి ఛైర్మన్‌గా వున్న సమయంలో ప్లాస్మా టీవీల కుంభ కోణం, తాళిబొట్ల కుంభకోణం, అభిషేకం టిక్కెట్ల కుంభకోణం, తలనీలాల కుంభకోణం, స్వామి వారి డాలర్ల కుంభకోణం వంటి పలు కుంభకోణాలు చోటు చేసుకున్నాయని ఆయన గుర్తు చేశారు. వైవి సుబ్బారెడ్డి టిటిడి ఛైర్మన్‌గా వున్న సమయంలో వ్యాపార, ఆర్థిక, రాజకీయాల ప్రయోజనాల కోసం దర్శన టిక్కెట్ల కేటాయింపులు సామాన్యుల కంటే విఐపిలకే ప్రాధాన్యత ఇచ్చి భక్తుల విశ్వాసంను వైకాపా దెబ్బతీసిందన్నారు.

## పరశురామేశ్వరుని సన్నిధిలో దేవాదాయ డిసి



శ్రీకాళహస్తిరూరల్,అగస్టు 21 ప్రభాతవార్త : ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరుని సన్నిధిలో దేవాదాయశాఖ డెప్యూటీ కమిషనర్ మేడిపల్లి విజయరాజు దర్శించుకున్నారు. గురువారం వారికి ఆలయ కార్యనిర్వహణాధికారి రామచంద్రారెడ్డి సారథ్యంలో స్వాగతం పలికారు. వారికి ఆలయమాజీ ఛైర్మెన్ బత్తల గిరినాయుడు ఆలయ అర్చకులు యోగేంద్ర, వపన్‌కుమార్‌శర్మలు స్వాగతం పలికారు. ఈ సందర్బంగా అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి సంబంధించి వివరిస్తూ ప్రత్యేక బస్సులను తిరుపతి నుంచి నడిపితే ఇంకా భక్తులు పెరిగే అవకాశం ఉందని గిరినాయుడు డెప్యూటి ఇఒకు వివరించారు.

## మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా



శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 21 ప్రభాతవార్త : ఏర్పేడు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట గురువారం సిపిఎం సారథ్యంలో వికలాంగుల పెన్షన్ల తొలగింపుకు నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఏర్పేడు మండల పార్టీ కార్యదర్శి షేక్ కరీముల్లా సారథ్యంలో ఆందోళన కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. మండలంలో సుమారు 240 మంది వికలాంగులకు సంబంధించిన పెన్షన్లు తొలగించారు. గతంలో సదరన్ సర్టిఫికేట్లలో 60నుంచి 70శాతం అంగవైకల్యంకల్గిన వారికి తిరిగి ప్రభుత్వంలో ప్రస్తుత సర్టిఫికేట్లలో 10 నుంచి 20శాతం ఇవ్వటం విడ్డూరంగా ఉందని ధ్వజమెత్తారు.ధర్నా జరిపిన వారు ఎంపిడిఒ సౌభాగ్యంకు వినతి పత్రం అందించారు.ఈ ధర్నాను మండల పార్టీ నాయకులు కరీముల్లా,కె.,రంగయ్య, వెంకటాద్రిల సారథ్యంలో ధర్నా నిర్వహించారు.

## దళితులకు మండలంలో రక్షణ లేదా?



తొట్టంబేడు,ఆగస్టు 21 ప్రభాతవార్త : తొట్టంబేడు మండలంలోని దళితులకు వారి భూములకు రక్షణ కరువైందని సిపిఎం పార్టీ నాయకుడు అంగేరి పుల్లయ్య ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలోని తహశీల్దార్ భారతికి ఓ వినతి పత్రం సమర్పించారు. మండలంలో దళితులంటే చులకన భావం చోటు చేసుకుందని వారి భూములను ఆక్రమించుకుంటూ వారిపై దౌర్జన్యాలు చేస్తూ వారిపైనే కేసులు బనాయిస్తున్నారంటూ ఆరోపిస్తూ ఫిర్యాదు చేసారు.బడుగు బలహీన వర్గాలపై ఇంకా అణచివేతకు పాల్పడుతున్న ఆగ్రవర్ణాల దాడులు ఇంకెంతకాలం అనిప్రశ్నించారు.తహశీల్దార్ భారతి స్పందిస్తూ పరిశీలించి నిరుపేదలకు న్యాయం చేస్తామని వివరించారు.

## చవితి సంబరాల్లో సంయమనం పాటించండి : సిఐ



శ్రీకాళహస్తి,ఆగస్టు 21 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో వినాయక చవితి సంబరాలు ప్రశాంతంగా జరుపుకొనుటకు సంయమనం పాటించాలని టూ టౌన్ సిఐ నాగార్జున్‌రెడ్డి గురువారం విఎంపల్లిలో యువకులతో చైతన్య సమావేశం ఏర్పాటు చేసారు.ఈ సందర్బంగా ఆయన యువతకు సూచనలిస్తూ ఎక్కడెక్కడ వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకుంటారో ముందుగా పోలీసులకు దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలని వివరించారు. గతంలో చోటు చేసుకున్న సంఘటనల దృష్ట్యా యువత పోలీసులతో సహకరించాలని సూచించారు.చవితి సంబరాల్లో యువత సంయమనం పాటించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులతో సహాకరించాలన్నారు.ముఖ్యంగా తెలుగుగంగ కాలువలో నిమజ్జనానికి వెళ్ళే ముందుతమకుసమాచారంఅందించాలనిసిఐనాగార్జున్‌రెడ్డికోరారు.ప్రతిమలు12అడుగులుమించరాదన్నారు.

## కులవృత్తులకు ఉచిత విద్యుత్... చంద్రన్నకు జేజేలు



శ్రీకాళహస్తి,ఆగస్టు 21 ప్రభాతవార్త : కులవృత్తులను ఆదుకొనుటలో తెలుగుదేశం నాయకుడు నారాచంద్రబాబునాయుడు ముందుంటారని రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్‌యం.ఉమేష్‌రావు అన్నారు. కుల వృత్తులకు వెసులుబాట్లు కల్పించటంలో దేశంలోనే ఆంధ్రరాష్ట్రం మొదటి వరుసలో ఉన్నారని వివరించారు. కుల వృత్తులకు కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్‌తో ప్రోత్స హిస్తుందన్నారు. నేతన్నలకు చెందిన చేతి మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్లు విద్యుత్‌ను ఉచితంగా అందించే విధంగా ఉత్తర్వులు జారి చేసారన్నారు.ఈ సమావేశంలో ఉమేషరావుతో పాటు తంగేళ్ళ పాళెం సింగిల్ విండో ఛైర్మెన్ బీమాల బాస్కర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి మునిరాజాయాదవ్, కోట చంద్రశేఖర్ నాగేశుు, రమేస్,కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## ప్రసన్న వెంకన్న సేవలో సుప్రీం కోర్టు జడ్జి



వడమాలపేట, ఆగస్టు 21 ప్రభాతవార్త: సుప్రీం కోర్టు న్యాయవాది సంజయ్ కరోల్ గురువారం వడమాలపేట మండలంలోని అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో వచ్చిన ఆయనకు ఆలయ అధికారి వేణుగోపాల్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్య కుమారాచార్యులు అభయ హస్తుడైన స్వామి వారి విశిష్టతను ఆలయ చరిత్రను వివరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## సదాశివకోనలో పాలకమండలి ప్రమాణ స్వీకారం

వడమాలపేట, ఆగస్టు 21 ప్రభాతవార్త: సదాశివకోన ఆలయం నూతన కమిటీ గురువారం ఉదయం



సదాశివకోనలోని సదాశివుని సన్నిధిలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్‌గా శ్రీధర్ వర్మ,సభ్యులుగా సురేష్, మునిరాజా, శివకుమార్, మంజులదేవి, తులసమ్మ, సుబ్బమ్మ, మాజీ ఆఫీసియో అమర్‌నాద ్‌స్వామిల చేత ఆలయ ఈవో ప్రమాణస్వీకారం చేయించారు. వడమాలపేట మండల పరిధిలోని సదాశివకోన క్షేత్రంలో శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి దేవస్థానంనూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలో స్వామివారికి వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. తదుపరి పాలక మండలి సభ్యులను వేద మంత్రోచ్చారణలతో ఆశీర్వదించారు. ఆలయ చైర్మన్ శ్రీధర్‌వర్మ మాట్లాడుతూ సదాశివకోన క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది శివ భక్తులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఆలయ అభివద్ధికి కృషి చేస్తామని, స్వామివారికి నిత్య కైంకర్యాలతో సేవలందిస్తానని అన్నారు. తమకు ఈ బాధ్యతను అప్పగించిన నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు దాముయాదవ్, శివరాయల్, పుత్తూరు పట్టణ అధ్యక్షుడు జీవరత్నంనాయుడు, పుత్తూరు శివాలయం చైర్మన్ దిలీప్, మండల సింగిల్‌విండో చైర్మన్‌కుమార్,పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి లక్ష్మిప్రసన్న, శ్రీ బొమ్మరాజపురం సర్పంచ్ మణిరాజు, పెద్దబ్బ రాజు, హేమావతి, ఉమాపతి, సత్య, అంజయ్య,వినోద్, పూర్ణ, హరిరాజు, తోట రవి, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలి

విజయపురం, ఆగస్టు 21 ప్రభాతవార్త: విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి విష్ణుప్రియ పేర్కొన్నారు. గురువారం విజయపురం మండలం శ్రీహరిపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పైన అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు ప్రతిరోజు ఉదయం సాయంత్రం స్నానం చేయాలని, ఉతికిన బట్టలు ధరించాలని, ప్రతి గురువారం బరన్ మాత్రలు వేసుకోవాలని, చేతులు శుభ్రం చేయు పద్ధతులు వివరించారు. ప్రధానోపాధ్యాయులు వెంకమరాజు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని ఆరోగ్యంగా ఉన్న విద్యార్థి అన్ని రంగాల్లో చురుకుగా పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు చంద్రమోహన్, పబ్లిక్ హెల్త్ నర్సు భారతి, ఉపాధ్యాయులు సూరలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది వినోలియా, గీత, ఆశ కార్యకర్తలు సుజాత, లక్ష్మి, లత,భారతి పాల్గొన్నారు.

## వైద్య వృత్తిలో ఉత్తమ సేవలకు ప్రశంసలు

సహచర వైద్య సిబ్బంది సన్మానాలు

చంద్రగిరి, ఆగస్టు 21 ప్రభాతవార్త:



శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కమ్యూనిటీ మెడిసిన్ హెచ్ఒడి డాక్టర్ సునీత శ్రీగిరి విధినిర్వహణలో ఉత్తమ సేవలందించిందుకు 79 స్వాతంత్ర్య దినోత్సవం రోజున జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ నేపధ్యంలో మండల హైల్త్ ఆఫీసర్ డాక్టర్ ఐ.యుగంధర్ ఆధ్వర్యంలో గురువారం రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌లో తమ విభాగాధిపతి డాక్టర్ సునీత శ్రీగిరిని ప్రత్యేకంగా రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌కు ఆహ్వానించారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన అభినందన సత్కార సభకు ఆమెను సాదరంగా ఆహ్వానించారు. అనంతరం డాక్టర్ యుగంధర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది దుశ్శాలువ, ప్రశంసాపత్ర చిత్రపటాన్ని ఆమెకు అందజేసి అభినందనలు తెలిపారు. యువతరం వైద్యులు డాక్టర్ సునీత శ్రీగిరిని ఆదర్శంగా తీసుకుని గౌరవమన్ననలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివకళ, డాక్టర్ కృష్ణకుమారి, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ హేమచంద్ర, డాక్టర్ దయాకర్ రావు, డాక్టర్ శ్రీదర్, డాక్టర్ మధుసూదన్ రావు, డాక్టర్ సౌమ్యప్రియ, డాక్టర్ శశికళ, డాక్టర్ హేమలత, డాక్టర్ రేవతి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎం.టాటాబాయి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత ప్రయాణం సరే



ఉపాధికోల్పోతున్న ఆటో కార్మికుల సంగతేంటి..?

ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.శివ

*చంద్రగిరి, ఆగస్టు 21 ప్రభాతవార్త:* మహిళలకు ఉచిత ప్రయాణం సరే మరి నష్టపోతున్న ఆటో కార్మికులకు పరిస్థితి ఏమిటని ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.శివ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్థానిక టవర్ క్లాక్ వద్ద గురువారం ఏఐటియుసి ఆధ్వర్యంలో టవర్ క్లాక్ వద్ద ఆటో వర్కర్స్‌కు న్యాయం చేయాలని కోరుతూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత ప్రయాణం ద్వారా ఉపాధి కోల్పోతున్న వేలాది మంది ఆటో కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ బ్యాంకుల ద్వారా 5 శాతం వడ్డీతో ఆటోలు కొనుగోలుకు రుణంతో పాటు ప్రమాద భీమా రూ.10 లక్షలు అందిస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ నీటిమూటలయ్యాయని ఎద్దేవా చేశారు. సిపిఐ మండల కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ ఆటో కార్మికులకు గతంలో పట్టాలు అందజేసి స్థలం చూపలేదని వెంటనే కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. నిరుపయోగంగా వున్న చంద్రగిరి ఆర్టీసి బస్టాండ్‌ను అందుబాలోకి తీసుకువచ్చి అంతరాష్ట్ర సర్వీసులను బస్టాండ్‌కు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తం రెడ్డి, ఏపి బాల, వాణి, ప్రమీల, బాలకృష్ణ, బాబు, వీరయ్య, రమణయ్య, దేవేంద్ర, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## అయ్యా

కలెక్టర్ గారూ..

ప్రత్యేక ప్రతిభావంతుడను న్యాయండి..! 153 మందికి పింఛన్ల తొలగింపు..!

*రామచంద్రాపురం, ఆగస్టు 21 ప్రభాతవార్త:*



అయ్యా.. కలెక్టర్ గారూ నేను పుట్టుకతో ప్రత్యేక ప్రతిభావంతుడను (మూగ, చెవుడు) మీరే న్యాయం చేయగలరని పాత వేపకుప్పంకు చెందిన పరశురామిరెడ్డి కన్నీటి పర్యంతమయ్యాడు. ఆర్ సి మండలంలో పింఛన్ల పునఃపరిశీలనలో 153 మంది పింఛన్లను తొలగించారు. ఇందులో కనీసం మూడవ వంతు మంది లబ్దిదారులు అర్హత కలిగివున్నప్పటికీ వైద్య నిపుణులు నిర్లక్ష్యంతో వ్యవహరించి ఇష్టారాజ్యంగా పింఛన్లను తొలగించారు. ఇందులో పరశురామిరెడ్డి వైకల్యాన్ని వంద శాతం కలిగివున్నప్పటికీ ప్రస్తుత వైద్యాధికారులు కేవలం 13 శాతం మాత్రమే వైకల్యాన్ని ధృవీకరించడంతో పింఛన్ తొలగించినట్లు అధికారులు గురువారం నోటీసులు ఇచ్చినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రత్యేక ప్రతిభావంతుడనైనందున కేవలం పింఛన్ ఆధారంగా జీవితాన్ని వెళ్ళదీస్తున్నట్లు లబ్ధిదారుడు వివరించారు. తన ఆవేదనను ఎంపిడిఒ చంద్రశేఖర్ రెడ్డికి వివరించి మరోమారు దరఖాస్తు (అప్పీల్) చేసుకున్నట్లు తెలియజేశాడు. అధికారులు అర్హులైన వారికి అన్యాయం జరగనీయకుండా చూడవలసిన బాధ్యత అధికారులపై వున్నది.

## కొటాల జడ్పీ హైస్కూల్‌కు వాటర్ ట్యాంకు వితరణ



చంద్రగిరి, ఆగస్టు 21 ప్రభాతవార్త: లోక శాంతి అభివృద్ధి సేవ సంఘం వారిచే దేవాలయ పురోహితులు ద్వారకనాథ్ స్వామి కొటాల జడ్పీ హైస్కూల్‌కు వెయ్యి లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకు వితరణ చేశారని హెచ్ఎం కేశవులు తెలిపారు. పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రూ.17 వేలు వ్యయంతో వాటర్ ట్యాంకు, విద్యార్దులకు జామెంట్రీ బాక్సులు పంపిణీ చేసినట్లు వివరించారు. అనంతరం దాతలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఘనంగా సన్మానించారు. కాగా కొటాల పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుగా కేశవులు బాధ్యతలు తీసుకున్నప్పటి నుండి దాతల సహకారాన్ని అందిపుచ్చుకుని పాఠశాల అభివృద్ధి ఎనలేని సేలందిస్తున్నట్లు ఉపాధ్యాయులు, గ్రామస్థులు కొనియాడుతున్నారు.

## నేడు తిరుపతిలో మంత్రి డోలా పర్యటన

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 21 ప్రభాతవార్త : తిరుపతిలో శుక్రవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పర్యటించనున్నట్లు అమరావతి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు కచ్చపి ఆడిటోరియంలో ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు, అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల సాంఘిక సంక్షేమ శాఖాధికారులతో నిర్వహించే రీజనల్ కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొంటారన్నారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు బైరాగిపట్టెడలో నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ భాషలో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి డోలా ప్రారంభించనున్నట్లు ఆయన తెలియజేశారు.

## వ్యక్తిగత ఆర్థిక భద్రతపై పెట్టుబడులు చాలా కీలకం

*తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 21 ప్రభాతవార్త :*



వ్యక్తిగత ఆర్థిక భద్రతకు పెట్టుబడులు చాలా కీలకమని జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలోని వీడియో కాన్ఫెరెన్స్ హాల్‌లో నందు సెబీ వారిచే ఏర్పాటు చేసిన ప్రాంతీయ పెట్టుబడి దారులకు సెమినార్, అవగాహన కార్యక్రమంలో జేసీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పెట్టుబడులు పెట్టడం అన్నది చాలా ముఖ్యమని, ఇది మన వ్యక్తిగత ఆర్థిక భద్రతకే కాకుండా రిటైర్మెంట్ తర్వాత కూడా జీవన భద్రతకూ ఎంతో అవసరమన్నారు. అదే సమయంలో దేశ ఆర్థికాభివృద్ధికి కూడా పెట్టుబడులు ఎంతో తోడ్పడుతుందన్నారు. సెబి, జనరల్ మేనేజర్ ఎం.కె శ్రీకాంత్ మాట్లాడుతూ డబ్బుపోతే మరల సంపాదించుకోవచ్చునని సమయం వృధా అయితే మరల తిరిగి రాదన్నారు. కలెక్టరేట్‌లోని వివిధ శాఖలకు చెందిన హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

## అర్హత కల్గిన వికలాంగులందరికీ పెన్షన్లు

- జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు డిమాండ్



చిత్తూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త: గతంలో వికలాంగులకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న పెన్షన్‌ను రద్దు చేయడం అన్యాయమని, అర్హులైన వికలాంగులందరికీ ప్రభుత్వం పెన్షన్లు మంజూరు చేయాలని జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. జిల్లా సిపిఐ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ గతంలో ఎవరైతే వికలాంగులుగా వున్నారో వారు సంబంధిత వైద్యాధికారుల వద్ద అన్ని పరీక్షలు నిర్వహించుకుని సర్టిఫికేట్లు పొందిన అనంతరం పెన్షన్‌కు దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి వారికి పెన్షన్లు మంజూరు చేశారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన అనంతరం అత్యధికుల వికలాంగుల పెన్షన్‌ను రద్దు చేయడం జరిగిందని విమర్శించారు. వున్న ఫలంగా వికలాంగులకు పెన్షన్ రద్దు చేయడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆరోపించారు. ఈ విషయంపై కలెక్టర్ జోక్యం చేసుకుని అర్హులైన వికలాంగులందరికీ పెన్షన్ మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు దాసరి చంద్ర, కె.మణి, విసి గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తైలం చెట్ల రవాణా



రామకుప్పం, ఆగస్టు 21 ప్రభాతవార్త

మండలంలో కొందమంది కలప వ్యాపారులు అక్రమంగా తైలం చెట్లను కోసి తరలిస్తున్నారు. గురువారం రామకుప్పం నుంచి వి.కోట, రాజుపేట రోడ్డుకు తైలం చెట్లను అక్రమార్కులు యధేచ్ఛగా తరలించి వేలల్లో సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కలప అక్రమ రవాణాను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# తిరుపతి డివిజన్

## మునివేలుశెట్టి మృతికి ఎమ్మెల్యే నివాళి

నారాయణవనం, ఆగస్టు 21 ప్రభాతవార్త :



మండలకేంద్రంలోని నారాయణవనం మేజర్ పంచాయతీ నగరవీధికి చెందిన ఎన్ మునివేలుశెట్టి గురువారం ఉదయం మృతి చెందారు. ఆయన మృతివార్తను తెలుసుకున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, అతని తనయుడు జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్‌లు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తెలుగుదేశం పార్టీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. బంధువులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మాజీ నెడ్‌క్యాప్ ఛైర్మన్ ఆర్‌డి ఏకాంబరం, మాజీ ఎంపిపి పి గోవిందస్వామి, మాజీ సర్పంచ్ కెఎస్‌రవి, నాయకులు గాండ్ల శివకుమార్, గోవిందశెట్టి, రవిశెట్టి, కుమార్, మొహిద్దీన్, మోహన్, శరవణ, ఇంకా నాయకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## దాసరి మునెయ్యను తెలుగు తేజం అవార్డుకు ఎంపిక

నారాయణవనం, ఆగస్టు 21 ప్రభాతవార్త :



నారాయణవనం బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు అధ్యాపకులుగా పని చేస్తున్న దాసరి మునెయ్యను తెలుగు తేజం పురస్కార అవార్డుకు ఎంపిక చేసినట్టు శ్రీశ్రీకళావేదిక అంతర్జాతీయ అధ్యక్షులు కత్తిమండ ప్రతాప్ తెలిపారు. ఈనెల 29న తెలుగు వ్యవహారాల పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని ఈ అవార్డును ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. 31వ తేది నరసారావుపేటలో నిర్వహించే కార్యక్రమంలో ఈ అవార్డును అందుకోవడం జరుగుతుందన్నారు. ఆయనకి ఈ అవార్డు రావడం పట్ల పలువురు టీచర్లు అభినందనలు తెలిపారు

## కూటమి ప్రభుత్వంపై వైసిపి నాయకులు దుష్ప్రచారం

- టిటిడి ఉద్యోగుల ప్రక్షాళన జరగాలి-చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని



*తిరుపతిరూరల్,ఆగస్టు21 ప్రభాతవార్త:* కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే వైసిపి నాయకులు కుటమిని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంపై ఏదోఒక విధంగా నిందలు మోపుతుందన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వంలో హిందువుల మనోభావాలు దెబ్బతినే విధంగా తిరుమల కొండపై, కనకదుర్గమ్మ, శ్రీశైలం, సింహాచలం గుడిపై దాడులు జరిగిన సంగతిని గుర్తు చేసారు. తెలుగుదేశం పార్టీకి చెడ్డపేరు రావాలనే దురుద్దేశంతోనే టిటిడి ఛైర్మెన్ బి.ఆర్.నాయుడుపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. టిటిడి మాజీ ఛైర్మెన్ భూమన కరుణాకర్‌రెడ్డి అనుచరుడు నాగరాజు అనే వ్యక్తి తిరుమలలో మద్యం సేవించి, ఏవిధంగా అపవిత్రతకు పాల్పడ్డారో అందిరికి తెల్సిందే అన్నారు. భూమనకు సంబంధించిన వ్యక్తులు తిరుమలలో బహిరంగ తట్టల వ్యాపారానికి తెర తీసారని, అక్రమ తట్ట వ్యాపారానికి అడ్డుకట్ట వేయడం జరుగుతుందన్నారు. టిటిడి మాజీ ఇవో ధర్మారెడ్డి ఏవిధంగా టిటిడిని అడ్డుపెట్టుకుని డిల్లీస్థాయిలో పైరవీలు చేస్తూ...అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. చంద్రగిరి నియోజకవర్గంలో జరిగిన లోకల్‌బాడీ ఎలక్సన్‌లో భూమన ప్రియశిష్యుడు చెవిరెడ్డి శ్రీవారి కళ్యాణం లడ్డులను ఏవిధంగా పంచిపెట్టారో అందరికి తెల్సిందే అన్నారు. చిరుత పులులు నుంచి సంరక్షించుకోవటానికి కర్ర ఏర్పాటు చేసారని, ఆ కర్రలు ఈ రోజు ఏమైనాయని ప్రశ్నించారు. కల్తీ నెయ్యిపై కూడా ప్రశ్నించలేదన్నారు. గోశాలలో హరినాధరెడ్డి వల్ల గోవులు మరణిస్తే ఆయనకు వత్తాసు పలికాడని, వైకుంఠ ద్వారా దర్శన తొక్కిసలాటలో భక్తులు మరణిస్తే దాపై కూడా దుష్ప్రచారం జేసారని ఆవేదన వ్యక్తం చేసారు.ఇప్పటికి టిటిడిలో వైసిపికి వత్తాసు పలికే ఉద్యోగులు ఉన్నారని...పూర్తిస్థాయిలో ఉద్యోగుల ప్రక్షాళన జరగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసిన కూటమి ప్రభుత్వం

-చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

-టిడిపి నాయకుల సమన్వయ సమావేశంలో

ఎమ్మెల్యే పులివర్తి నాని



తిరుపతిరూరల్,ఆగస్టు21 ప్రభాతవార్త: టిడిపి ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన సూఫర్ సిక్స్ పథకాలను అమలు చేసి, ప్రజామన్ననలు పొందుతుందని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఐటిశాఖ మంత్రి సహాయ సహకారాలతో చంద్రగిరిని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారుసూపర్ సిక్స్ పథకాలలో ఒకటైన శ్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఆగస్టు 15వ తేదీ నుండి ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించిన విషయాన్ని గుర్తు చేసారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డియస్సీ, పెన్సన్ పెంపు, దీపం పథకం, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, శ్రీశక్తి పథకాన్ని అమలు చేసారన్నారు. సూపర్ సిక్స్ పథకాలను కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.చంద్రగిరి నియోజకవర్గంలో ఏడాది పాలనలో పాకాల, చంద్రగిరి, రామచంద్రాపురం, చిన్నగొట్టుకల్లు, యర్రావారిపాలెం మండలాల్లో ఎన్నో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. రైతులకు వ్యవసాయ పనిముట్లు, మినీ గోకులాలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. టిటిడి తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి సుమారు రూ.19కోట్ల రుపాయాలు మంజూరుకు ఆమోదం తెలిపినట్లు తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఇంకా 30వేల దొంగ ఓట్లు ఉన్నాయని ఆరోఫించారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, ఆరు మండలాల అధ్యక్షులు, బూత్ క్లస్టర్లు, యూనిట్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

## జాయింట్ యాక్షన్ కమిటీ నేతల నిరసనల తో హోరెత్తిన సి ఆర్ ఎస్...



*రేణిగుంట ఆగస్టు 21 ప్రభాతవార్త* రేణిగుంట సిఆర్ఎస్ ప్రాంగణం లో గురువారం జాయింట్ యాక్షన్ కమిటీ నేతల నిరసనలతో హోరెత్తింది. యూనియన్ నాయకులు 2024 లో జరిగిన రివ్యూ మీటింగ్ రిపోర్ట్ అడ్డుపెట్టుకొని ప్రతి నెల ఇస్తున్న 50 శాతం ఇన్సెంటివ్ తగ్గించాలని జరుగుతున్న కుట్రను ఖండించారు. ఉద్యోగ కార్మికుల న్యాయ సమ్మతమైన డిమాండ్లను అమలు పరచాలని కోరారు. ట్రేడ్ యూనియన్ నేతలతో చర్చించిన తర్వాతే రివ్యూ రిపోర్ట్ అమలు చేయాలన్నారు. వందే భారత్, త్రీఫేస్ మెనూ ట్రైన్స్ కు మాన్ పవర్ ను శాంక్షన్ చేయాలన్నారు. ఇన్సెంటివ్ తగ్గిస్తే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి బాబు, ఎంప్లాయిస్ సంఘ్ చైర్మన్ మునయ్య కార్మిక సంఘాల జేఏసీ ప్రముఖ నాయకులు సదాశివరెడ్డి, వెంకటరమణ,సతీష్,ఉదయ్‌రత్నం,గంగన్న,శేషప్ప,పద్మనాభరెడ్డి,పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు..

## త్రివిక్రమ్ శ్రీనివాస్, అక్కినేని నాగార్జునకు వీడ్కోలు..

*రేణిగుంట ఆగస్టు 21 ప్రభాతవార్త* ఁణిగుంట విమానాశ్రయం నందు గురువారం శ్రీవారి దర్శనానంతరం హైదరాబాద్ తిరుగు ప్రయాణమైన ప్రముఖ సినీ దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్, అక్కినేని నాగచైతన్యకు ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన కార్యదర్శి అంజూరు చక్రధర్ ఘనంగా వీడ్కోలు పలికారు. విమానాశ్రయంలో ఇరువురు సినీ ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలిసి వారిని చక్రధర్ పూల బొకే ఇచ్చి తన అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి ప్రసాదాలను అందజేశారు.

## శ్రీరామ ఇంజనీరింగ్ కాలేజ్ లో ఘనంగా ఓరియెంటేషన్ డే.



*తిరుపతి విద్య ఆగస్టు 21 ప్రభాత వార్త:* కరకంబాడి రోడ్ లో ఉన్న శ్రీరామ ఇంజనీరింగ్ కాలేజ్ లో గురువారం మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులకు ఘనంగా ఓరియెంటేషన్ డే ని నిర్వహించారు.ఈ కార్యక్రమంకి ముఖ్య అతిధి గా తిరుపతి ఐ.ఐ. టి. కి చెందిన ప్రొఫెసర్ వి.వాసుదేవరావు విచ్చేసి సభని ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ఎప్పుడు తమ జ్ఞానం ని పెంపొందిచుకోవాలి అని,జ్ఞానమే తరగని సంపద అని తెలియచేసారు.ఇంజనీరింగ్ విద్యార్థులు ఎప్పటికప్పుడు వచ్చే టెక్నాలజీ ని మననం చేసుకుంటూ విద్య అభ్యసించాలి అని తెలిపారు.కళాశాల చైర్మన్ మన్నెం.రామిరెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల ని ఎంచుకున్న ప్రతి ఒక్క విద్యార్థిని విద్యార్థులకు కృతజ్ఞతలు తెలుపుతూ మీరు ఏ లక్ష్యం తో అయితే మా కళాశాల ని ఎంచుకున్నారో ఆ కల సాకారం చెయ్యటకు నిరంతరం శ్రమిస్తాము అని తెలియచేసారు.కళాశాల డైరెక్టర్ మన్నెం.అరవిందు కుమార్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల మీద నమ్మకం తో తల్లిదండ్రులు వారి పిల్లలను చేరిపించటం ఎంతో సంతోషం గా ఉంది అని ,వారి పిల్లల ఉజ్వల భవిష్యత్ కు తమ కళాశాల లో అన్ని విధాలుగా వనరులు కల్పించి వారి బంగారు భవిష్యత్తు ఇవ్వటం కోసం నిరంతరం శ్రామిస్తాము అని తెలియచేసారు.కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.జయ చంద్ర కళాశాల యొక్క అకడమిక్,విధి విధానాల గురించి మొదటి సంవత్సరం విద్యార్థులకు తెలియచేసారు. కళాశాల సెక్రటరీ మన్నెం.రామసుబ్బారెడ్డి అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సంగీతవిద్వాంసుడు భరద్వాజ్‌కు ఆత్మీయ సన్మానం



తిరుపతి రవాణ,ఆగస్టు 21ప్రభాతవార్త పాండిచ్చేరి ఇంటర్ నేషనల్ పీస్ యూనివర్సిటీ నుండి గౌరవ డాక్టోరేట్ అందుకున్న సంగీత విద్వాంసుడు వివిఎస్ భరద్వాజ్‌ను రాయలసీమరంగస్థలి ఆత్మీయ సత్కారం చేసింది. ఇటీవల ఆయన ఈ గౌరవడాక్టరేట్ అందుకోవడం సంగీత విద్వాంసులకేగాక సంగీతప్రియు లకు,కళాకారులకు మరిం తగా ఆత్మస్థైర్యం కల్పించినట్లవుతుందని రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాలగోపీనాధరెడ్డి తెలిపారు. సంస్కృతి,సాంప్రదాయాలను భావితరాలకు అందజేయడానికిఈఅవార్డుఆయనకుమరింతగా ప్రోత్సాహాన్ని స్తుందన్నారు. ఆయనకు ఈ హోదా రావడం పట్ల గురువారం ఆయన శిష్యబృం దం బత్తిరెడ్డి, కన్నెప్ప గారి కేశవులు, చంద్రబాబు నాయుడు, చంద్రశేఖరరెడ్డి, తిరుపాలాచారి, వెంకటాద్రి, రామలింగేశ్వర కుమార్, ప్రదీప్, సంతోష్, యువరాజు,మధుసూదన్,యశోధ,శోభారాణి దుశ్శాలువతో, శ్రీవారి మెమోంటోతో సత్కరించారు



## రైతుల భూములపై ఆరా

కోట, ఆగస్టు 21 ప్రభాతవార్త : కోట మండలం చిట్టేడు, కేశవరం, మద్దాలి గ్రామాల్లో గురువారం తహశీల్దార్ కె.జయజయరావు రైతులతో సమావేశమయ్యారు. రైతుల వద్ద భూములకు సంబంధించి ఎలాంటి ఆధారాలు ఉన్నాయో చూపాలని కోరారు. రైతులకు సలహాలు, సూచనలిచ్చారు. ఈ సమావేశంలో సర్వేయర్ గోపీనాథ్, విఆర్ఓలు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా



కోట, ఆగస్టు 21 ప్రభాతవార్త : కోట ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకురాళ్లు విజయ లక్ష్మి, ఆర్‌వి రమణమ్మ, సుజాత మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాలు పెంచాలని, మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ వర్కర్లుగా మార్చుతూ జీఓ ఇవ్వాలని, యాప్‌లు అన్నింటినీ కలిపి ఒక యాప్‌గా మార్చాలని, ఎఫ్‌ఆర్ఎస్ ఇన్ అవుట్ రద్దు చేయాలని, సెంటర్ నిర్వహణకు ట్యాబ్‌లు ఇవ్వాలని, 5జి ఇంటర్నెట్ ఇవ్వాలని, ప్రధానమంత్రి మాతృ వందనం పథకాన్ని కొత్తగా అంగన్‌వాడీలకు అప్పగించవద్దని కోరారు. గ్రాట్యుటీ జీఓలో మార్పులు చేయాలని, హెల్పర్ల ప్రమోషన్లకు గైడ్‌లైన్స్ రూపొందించాలని కోరారు. 2014 నుంచి అంగన్‌వాడీ కార్యకర్తల జీతాలు పెంచలేదని, 42 రోజులు చారిత్రాత్మక సమ్మె చేస్తే 2024 జూలైలో వేతనాలు పెంచుతామని తీర్మానం చేశారని, దాన్ని ఇంతవరకు ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. సమస్యలను పరిష్కరించకపోతే దశలవారీగా ఆందోళన చేపడతామని తెలిపారు.

## 54 మందికి పింఛన్లు తొలగింపు

కోట, ఆగస్టు 21 ప్రభాతవార్త : వైసీపీ ప్రభుత్వం హయాంలో పలువురు అనర్హులు సదరం ధ్రువీకరణ పత్రాలు పొంది ప్రతి నెలా పింఛన్ తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై కొంతమంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో కూటమి ప్రభుత్వం సదరం ధ్రువీకరణ పత్రాలు పునఃపరిశీలన చేయాలని నిర్ణయించింది. ఈ పరిశీలనలో తేలిన అంశాలు ఆధారంగా అనర్హులకు నోటీసులు ఇచ్చారు. కోట మండలంలో 54 మందికి నోటీసులు అందజేసినట్లు ఎంపిడిఓ వేణు తెలిపారు. పింఛన్ తొలగింపు నోటీసులు అందుకున్న వారు తమ వద్ద ఉన్న ఆధారాలతో మళ్లీ అప్పీలు చేసుకోవచ్చని చెప్పారు. వైకల్యం శాతం తక్కువ ఉంటే అటువంటి వారు 60 సంవత్సరాలు పైబడి ఉంటే రూ.4 వేలు పింఛన్ అందజేస్తామని పేర్కొన్నారు.

## పలు సమస్యలపై కలెక్టర్‌కు వినతి



వాకాడు, ఆగస్టు 21 ప్రభాతవార్త : మండల కేంద్రమైన వాకాడులోని పలు సమస్యలపై స్థానిక న్యాయవాది గాయం అనిల్ కుమార్‌తో స్థానికులు కలిసి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. గురువారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రభుత్వ ఆసుపత్రి బ్యారేజ్‌ను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను న్యాయవాది అనిల్ కుమార్ స్థానికులు కలిసి వినతి పత్రం అందజేస్తూ వాకాడు హరిజనవాడలోని డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉందని, చెత్తాచెదారం మురికి కాలు లేని ఉండి విషపూరిత దోమలు ఉన్నాయని రానున్న వర్షాకాలం సీజన్లో అనేక వ్యాధులు సంభవించే అవకాశం ఉందని తెలియజేశారు. సంబంధించిన అధికారులు పట్టించుకోవడంలేదని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా ఆర్టిసి బస్టాండు, దళితవాడ పక్కనే ఉన్న గ్రౌండ్ నుండి విషపూరితమైన పాములు, తేలులు డ్రైనేజీ కాలువకుండా ఇళ్లల్లోకి వస్తున్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ స్పందించి సంబంధించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని న్యాయవాది అనిల్ కుమార్‌కు స్థానికులకు భరోసా ఇచ్చారు.

## ఐసిడిఎస్‌కు మాతృ వందనం

కోట, ఆగస్టు 21 ప్రభాతవార్త : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాతా శిశు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాయి. ఇందులో భాగంగా ప్రధానమంత్రి మాతృ వందన యోజనకు శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు క్షేత్రస్థాయిలోనే అర్హులను ఎఎన్ఎంలు గుర్తించాక వైద్యశాఖ ఉన్నతాధికారులు పర్యవేక్షించే వారు. ఈ నెల నుంచి పథకం అమలు, లబ్ధిదారుల ఎంపిక బాధ్యతలను మహిళా, శిశు సంక్షేమశాఖకు బదలాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ఆర్థిక సమస్యల కారణంగా కొంతమంది గర్భిణులు ప్రసవమైన తర్వాత బిడ్డలకు సకాలంలో పోషకాహారం అందించలేకపోతున్నారు. కొన్ని రకాల టీకాలు వేయించలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మాతృ వందన యోజన పథకంలో భాగంగా ఆర్థిక సహాయం అందజేస్తుంది. గర్భందాల్చినట్లు నిర్ధారణ అయిన తర్వాత అంగన్‌వాడీ కేంద్రంలో రిజిస్ట్రేషన్, అనంతరం మొదటి కాన్పుకు కొన్ని నెలలు తర్వాత రూ.వెయ్యి, తర్వాత మరో రెండు వేలు వారి ఖాతాలో జమ చేస్తారు. పిల్లలకు టీకాలు వేయడం పూర్తయిన తర్వాత మరో రెండువేలు అందజేస్తారు. రెండవ కాన్పులో ఆడపిల్ల పుడితే మూడు విడతల్లో ఆరు వేలు అందజేస్తారు. తెల్ల రేషన్ కార్డుదారులు అందరూ ఈ పథకానికి అర్హులని అధికార వర్గాలు తెలిపాయి.

## లైబ్రెరీ మూసేశారు... ఉద్యోగం ఆపేశారు!



వాకాడు, ఆగస్టు 21 ప్రభాతవార్త: మండల కేంద్రమైన వాకాడులోని గ్రంథాలయంను మూసేశారు, ఉద్యోగం ఆపేశారు అంటూ జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరకు వినతి పత్రం అందజేసింది. గురువారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రభుత్వ ఆసుపత్రి, బ్యారేజ్‌ని పరిశీలించారు. ఈ సందర్భంగా వాకాడు గ్రామానికి చెందిన గాయం విజయలక్ష్మి కొన్ని సంవత్సరాల నుండి లైబ్రరీలో స్వీపర్‌గా చేరి 250 రూపాయల నుండి 2500 వరకు జీతం వచ్చేదని ఆమె కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తాను జీతం మీద నా కుటుంబాన్ని పోషించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ స్పందించి సంబంధించిన అధికారులు తెలుసుకొని న్యాయం చేస్తానని ఆమెకు భరోసా ఇచ్చారు.

## చినుకు పడితే చెరువులా మారుతున్న రోడు

దొరవారి సత్రం ,ఆగష్టు 21 ప్రభాతవార్త: మండల పరిధిలోని పలు గ్రామాల్లో రోడ్లు ఆందోళనకరంగా మారుతున్న పట్టించుకోని అధికారులు తనియాలి కట్టపల్లి శ్రీధర్‌మల్లి కల్లూరు గ్రామాలు కనీసం నడవలేని స్థితిలో రోడ్లు. ప్రజలుకు డ్రైనేజీ కాలవలు లేకపోవడంతో వర్షానికి పడ్డ నీరు ఎటు పోలేని స్థితిలో ఉన్నందువలన ఎక్కడ లోతు ఎక్కడ పల్లం అర్థం కాకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని కొందరు ఆరోపిస్తున్నారు ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డు మీద ఉన్న నీరును పోవడానికి మార్గం చూపించాలని ఆ గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు

## పేదలకు కార్పొరేట్ వైద్యం : ఎమ్మెల్యే



సూళ్లూరుపేట, ఆగస్టు 21 ప్రభాతవార్త : అనారోగ్యంతో ఉన్న పేద, బలహీనవర్గాలకు కార్పొరేట్ వైద్యంతో వారిని పూర్వస్థితికి తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు మెరుగైన వైద్యసేవలను అందించేందుకు తమవంతు ప్రయత్నం చేస్తుందన్నారు. ఇందులో భాగంగా 14 నెలల కాలంలో సూళ్లూరుపేట నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో 109 మంది లబ్ధిదారులకు ఒక కోటి 71 లక్షల 61 వేల 228 మంది రూపాయలు అందజేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 14 మంది లబ్ధిదారులకు 14 లక్షల 47 వేల 715 రూపాయలు చెక్కుల రూపంలో అందజేశామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలోలాగా కక్ష సాధింపు రాజకీయాలు లేకుండా పార్టీలకు అతీతంగా పేదలను వైద్యపరంగా ఆదుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, ఎజి కిషోర్, మాధవనాయుడు, సెల్వం, అశోక్‌రెడ్డి, ఆలీభాయ్, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి జిల్లా బిసీ వెల్ఫేర్ ఆఫీసర్ మాకొద్దు!

**- రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రికి బిసీ సంక్షేమ సంఘ ఇన్‌ఛార్జీ షణ్ముగం ఫిర్యాదు**



చిత్తూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త: అవినీతి కార్యకలాపాలకు పాల్పడుతున్న జిల్లా బిసీ వెల్ఫేర్ ఆఫీసర్ రబ్బానీ భాషాను సత్వరం చిత్తూరు జిల్లా నుండి బదిలీ చేయాలని దక్షిణాది రాష్ట్రాల బిసీ సంక్షేమ సంఘ ఇన్‌ఛార్జీ, మాజీ చిత్తూరు టౌన్ బ్యాంకు ఛైర్మన్ పి.షణ్ముగం రాష్ట్ర బిసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను కలిసి విన్నవించారు. విజయవాడలో గురువారం దక్షిణాది రాష్ట్రాల బిసీ సంక్షేమ సంఘ ఇన్‌ఛార్జీ రాష్ట్ర బిసీ సంక్షేమశాఖ మంత్రి సవితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సవితతో ఆయన మాట్లాడుతూ బిసీల సంక్షేమం కోసం విధులు నిర్వర్తించాల్సిన జిల్లా బిసీ సంక్షేమశాఖ అధికారి రబ్బానీ భాషా ఇందుకు విరుద్ధంగా అవినీతి అక్రమాలకు పాల్పడి అర్హులైన బిసీలకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆయన ఫిర్యాదు చేశారు. ఇప్పటికే జిల్లా బిసీ సంక్షేమశాఖ అధికారి అవినీతి అక్రమాలపై జిల్లాకు చెందిన కొంతమంది ఎమ్మెల్యేలు మీకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారని, ఈ విషయాలపై విచారించి జిల్లా బిసీ సంక్షేమశాఖ అధికారిపై సత్వరం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఎన్నికల మేనిఫెస్టోలో ప్రభుత్వం చెప్పిన విధంగా వెనుకబడిన వర్గాలకు బిసీ రక్షణ చట్టం అమలు చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా బిసీ విద్యార్థులకు మౌళిక వసతుల కల్పనకు, వసతి గృహాల నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని, సెప్టెంబర్ 14వ తేదీ తిరుపతిలో జరుగనున్న బిసీ విద్యార్థుల మహాసభకు ముఖ్యఅతిధిగా హాజరు కావాలని దక్షిణాది రాష్ట్రాల జాతీయ బిసీ సంక్షేమ సంఘ ఇన్‌ఛార్జీ పి.షణ్ముగం రాష్ట్ర బిసీ సంక్షేమశాఖ మంత్రి సవితను కోరారు.

# అసంపూర్తిగా ఉన్న పంబలేరు వంతెన పూర్తి చేస్తా : ఎమ్మెల్యే పాశిం



గూడూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త : పంబలేరు బ్రిడ్జి నిర్మాణ పనులు వీలైనంత త్వరగా పూర్తిచేసి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూస్తామని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ అన్నారు. గూడూరు నెల్లూరు రహదారిలో గూడూరు పట్టణ శివారు ప్రాంతంలో ప్రవహిస్తున్న పంబలేరు వాగుపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి గత తెలుగుదేశం ప్రభుత్వం 18 కోట్ల రూపాయల నిధులతో శ్రీకారం చుట్టారు. అయితే బ్రిడ్జి నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో పాటు అప్రోచ్ రోడ్డు అధ్వానంగా తయారవడంతో గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ విలేకరుల సమావేశం మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఈ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరిగిందని ఆనాటి బ్రిడ్జి నిర్మాణ వ్యయం 18 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని అధికారులు నిర్ణయించారని అయితే ఇప్పటికీ అసంపూర్తిగా ఉండడంతో దీనిని పూర్తిచేసేందుకు అధికారుల ద్వారా ఎస్టిమేషన్ వేయించగా సుమారు 9 కోట్ల రూపాయల నిధులు అవసరం అవుతాయని తెలపడంతో తాను రోడ్డు రవాణా శాఖ మంత్రి జనార్దన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి 9 కోట్ల రూపాయలను మంజూరు చేయించి విడుదల చేయిస్తానని, త్వరలో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ క్రమంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న అప్రోచ్ రోడ్డు అధ్వానంగా ఉండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న దాని అప్రోచ్ రోడ్డు మర్మమతు పనులు చేస్తున్నామని వాహనదారులకు తాత్కాలికంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తానని తెలిపారు. ఆయన వెంట ఆరికట్ల మస్తాన్ నాయుడు, అబ్దుల్ రహీం, ఇజ్రాయిల్, కుమార్, స్థానిక టిడిపి నాయకులు ఉన్నారు.

## నిబంధనలతోనే వినాయక ప్రతిమలు ఏర్పాటు : ఎస్పీ



చిత్తూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త: వినాయకచవితి పురస్కరించుకుని వినాయక విగ్రహాలు ప్రతిష్టించ డానికి మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీసు నియమనిబంధనలు కచ్చితంగా పాటించాలని ఎస్పీ మణికంఠ చందోలు స్పష్టం చేశారు. వినాయక మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీసుల నుండి అనుమతులు పొందడానికి ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం వినాయకచవితి పురస్కరించుకుని ఏర్పాటు చేసే మండపాల కోసం ప్రత్యేకంగా ఒక సింగిల్‌విండో క్లియరెన్స్ విధానం తీసుకువచ్చిందన్నారు. ఇది వరకు వినాయక మండపాలు ఏర్పాటు చేసుకునేవారు అగ్నిమాపకశాఖ, మున్సిపల్ శాఖ, విద్యుత్‌శాఖ, పోలీసు శాఖల నుండి నిరభ్యంతర పత్రం(ఎన్‌ఓసి) తీసుకోవాల్సి వుండేదన్నారు. దీని కోసం నిర్వాహకులు ఆయా శాఖల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. వినాయక మండపాలు ఏర్పాటు చేసుకునేవారు 'గణేష్‌ఉత్సవ్.నెట్' వెబ్‌సైట్‌లో గణేష్ మండం ఏర్పాటు చేయదలచిన కమిటీ సభ్యుల వివరాలతో పాటు మరికొన్ని వివరాలు నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాల్సి వుంటుందన్నారు. ఏ వాహనంలో తీసుకెళ్ళి నిమజ్జనం చేస్తారు తదితర వివరాలు నమోదు చేసి సబ్మిట్ చేయాలన్నారు. అప్పుడు అప్లికేషన్ ఐడి నెంబర్ జనరేట్ చేయబడి దరఖాస్తు పోలీసుశాఖ అనుమతి కోసం వారి లాగిన్‌కువెళ్తుందన్నారు.

## గిద్దలూరు వద్ద ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

**- 26 ఎర్రచందనం దుంగలు స్వాధీనం - ఒక మోటారు సైకిల్ సీజ్**



తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 21 ప్రభాతవార్త : ప్రకాశం జిల్లా గిద్దలూరు ఫారెస్ట్ డివిజన్‌లో ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి వారి నుంచి 26 ఎర్రచందనం దుంగలు, ఒక మోటారు సైకిల్‌ను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణలో భాగంగా టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ ఎండీ షరీఫ్ మార్గనిర్దేశకత్వంలో కడప సబ్ కంట్రోల్ ఆర్ఎస్ఐ పీ. నరేష్ టీమ్ బుధవారం రాత్రి నుంచి ప్రకాశం జిల్లా గిద్దలూరు ఫారెస్ట్ రేంజ్ లోని బెస్తవారిపేట అటవీ పరిధిలో కూంబింగ్ చేపట్టారు. వీరు గుంతపల్లి బీటు పరిధిలో చేరుకొనే సరికి అక్కడ ఒక మోటారు సైకిల్ వద్ద కొంతమంది వ్యక్తులు గుమికూడి కనిపించారు. వారిని సమీపించడంతో, పోలీసులను చూసి పారిపోసాగారు. అయితే వారిని వెంబడించిన టాస్క్ ఫోర్స్ సిబ్బంది ముగ్గురిని పట్టుకున్నారు. వారిని విచారించడంతో అక్కడే కల్వర్టు కింద దాచి ఉంచిన 26ఎర్రచందనం దుంగలు లభించాయి. పట్టుబడిన వారిని ప్రకాశం జిల్లా వాసులుగా గుర్తించారు. వారిని దుంగలతో పాటు మోటారు సైకిల్ ను తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించారు. ముగ్గరుని డిఎస్పీ శ్రీనివాస రెడ్డి, ఏసీఎఫ్ శ్రీనివాస్ విచారించగా, హెడ్ కానిస్టేబుల్ సుబ్రమణ్యం రాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## దివ్యాంగుల పెన్షన్లు తొలగింపు : ఆధైర్యవడవద్దన్న ఎంఎల్ఏ



శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 21 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని 1659 మంది దివ్యాంగుల పెన్షన్లను తొలిగిస్తూ ప్రభుత్వాదికారులు ఉత్తర్వులు జారి చేసారు. వారం రోజులుగా నియోజకవర్గంలోని నాలుగు మండల పరిషత్ కార్యాలయాల వద్ద తొలగించిన పెన్షనర్లు పడిగాపులు పడుతున్నారు. వినతి పత్రాలు అందిస్తున్నారు. ఇంత కాలం లేని అనర్హత ఇప్పుడెందుకు వచ్చిందంటూ ప్రశ్నిస్తున్నారు. అయితే శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి మాత్రం కూటమి ప్రభుత్వం హాయాంలో ఎవరికి అన్యాయం జరగదని అందరికి న్యాయం జరుగుతుందని భరోసా ఇస్తున్నారు. వారం రోజులుగా శ్రీకాళహస్తి మండల పరిషత్ కార్యాలయం ఎదుట పెన్షనర్లు దీనంగా నిరీక్షిస్తున్నారు. వచ్చిన ప్రతి ఉద్యోగిని తమ గోడు వెళ్ళబోసు కుంటున్నారు. 60 సంవత్సరాలు దాటిన వారికి దివ్యాంగుల పెన్షన్ నుంచి వృద్ధాప్యపు పెన్షన్‌లుగా 295 మందిని మార్చారు. అయితే శాసనసభ్యుని సూచనల మేరకు అధికారులు తొలగించబడిన దివ్యాంగుల పెన్షన్స్ తొలగింపుకు సంబంధించి సదరన్ అవకాశం కల్పించాలని పరిశీలిస్తున్నారు. దాంతో నియోజకవర్గంలో అల జడి చోటు చేసుకుంది. కూటమి ప్రభుత్వాన్ని నమ్మి ఓటు వేస్తే మాకు ఇచ్చిన నజరానా?న అని వాపోతున్నారు. ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత చోటు చేసుకుంటుంది.

## తోపుడు బండ్లు లేవు - పారిశుద్ధ్య కార్మికుల మొర



శ్రీకాళహస్తి,ఆగస్టు 21 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు గురువారం శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి మున్సిపల్ కార్యాలయ సమావేశం భవనంలో యూనిఫారాలు, టెంకాయనూనె చెప్పులు ఇతర సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా ఆయన కార్మికుల నుద్దేశించి మట్లాడుతూ నేడు పట్టణ ప్రజలు పరిశుభ్రంగా ఉన్నారంటే అది మీ కృషి అన్నారు. ఇక్కడ పని చేసే కార్మికులకు సంబంధించి తాను యోచించానని వారికి ప్రత్యేకంగా మూడు సెంట్ల భూమిని అందిస్తామని అవసరమైతే ఇళ్ళు నిర్మించి ఇస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా కార్మికులను మాట్లాడాలని కోరగా కార్మిక నాయకుడు జాన్ మాట్లాడుతూ తాము పని చేయటానికి సిద్ధంగా ఉన్నామని అయితే తమకు తగిన పని ముట్లు లేదన్నారు. ముఖ్యంగా తొపుడు బండ్లు లేదు. తగినన్ని కంప్యాటర్లు లేదని ఎంఎల్ఏ దృష్టికి తీసుకురాగా ఆయన స్పందిస్తూ పాత విధానాలకు స్వస్తి చెప్పాలని పరిశుభ్రతకు సంబంధించి సాంకేతిక విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ సమావేశానికి మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్ అధ్యక్షత వహించగా దేశం నాయకులు మునిరాజా నాయుడు, రంగినేని చెంచయ్యనాయుడు, జి.విజయ కుమార్, సుబ్బయ్య, షాకిర్ అలి, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కండ్రిగ ఉమ, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## ఆటో యూనియన్ నూతన కార్యవర్గం

సూళ్లూరుపేట, ఆగస్టు 21 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా జయచంద్ర, అధ్యక్షులుగా కె.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎస్.సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా గోపీ, కార్యవర్గ సభ్యులుగా ఎ.వెంకటేశ్వర్లు, వెంకటరమణ, ఎ.వెంకటేష్, కె.భాస్కర్‌లను ఎన్నుకున్నారు.

## సిమ్స్‌లో క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్యం

బాలాయపల్లి, ఆగస్టు 21 ప్రభాతవార్త : సిమ్స్ ఆస్పత్రిలో క్యాన్సర్ వ్యాధికి అత్యాధునిక వైద్యం అందిస్తున్నట్లు వైద్యాధికారిణి డాక్టర్ చైతన్య భాను తెలిపారు. బాలాయపల్లి సచివాలయ ఆవరణలో పింక్ బస్సు స్క్రీనింగ్ పరీక్షలు శ్రీ బాలాజీ ఇన్స్టిట్యూట్ అఫ్ ఆంకాలజి, స్విమ్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగాయి. మొబైల్ కాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ ద్వారా ఉచితంగా కాన్సర్ వ్యాధి నిర్ధారణ వైద్య శిబిరాన్ని స్విమ్స్ వైద్యాధికారిణి డా.చైతన్య భాను నిర్వహించారు. రోగులకు బిపి, షుగర్, ఇంకా పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. చుట్టు ప్రక్కల గ్రామాలనుంచి వచ్చి మహిళలు, వృద్ధులు వైద్య పరీక్షలు బస్సు వద్దకు చేరుకొని పరీక్షలు చేయించుకున్నారు. స్విమ్స్ వైద్యాధికారిణి డా.చైతన్య భాను మాట్లాడుతూ ఇప్పటివరకు పలు గ్రామాలలో 498 క్యాంపులు ఈ పింకు బస్సు ద్వారా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కాన్సర్ స్క్రీనింగ్‌లో స్విమ్స్ వైద్యాధికారిణి డా.చైతన్య భాను, బాలాయపల్లి వైద్య అధికారి వెంకటరెడ్డి, యం. పిడిఒడిజె వినీల్ కుమార్ వైద్య సిబ్బంది ఏఎన్ఎంలు ఆశా వర్కర్లులు, స్విమ్స్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కండక్టర్‌ను విధుల్లోకి తీసుకోవాలి



గూడూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త: అన్యాయంగా సస్పెండ్ చేసిన కండక్టర్ శ్రావణ్ కుమార్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏపీపిటిడి నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. గూడూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో కార్యాలయం ఎదుట గురువారం ఏపీ.పి.టి.డి నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో డిపో ప్రెసిడెంట్ ప్రవీణ్, సెక్రటరీ శ్రీనివాసులు, ట్రెజరర్ గౌస్, గ్యారేజీ సెక్రటరీ ప్రవీణ్, కమలాకర్, కరీముల్లా,వెంకటేశ్వర్లు, సందాని, బాబు, రమేష్, సుధాకర్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి ఆత్మ హత్య!

చిల్లకూరు, ఆగష్టు 21 ప్రభాతవార్త : మండల పరిధిలోని కమ్మవారిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో చీమల తిప్ప వద్ద అనుమానస్పదంగా వ్యక్తి మృతి చెందాడు. ఈ విషయాన్ని చిల్లకూరు ఎస్సై సురేష్ బాబుకు సమాచారం అందడంతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించగా కోట గ్రామానికి చెందిన చల్లగుండ్ల హరిప్రసాద్ (41) అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి పెట్రోల్ పోసి నిప్పు అంటించారా.. లేకుంటే ఆ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడా అన్న విషయం తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంలో వ్యక్తి సగభాగం కాలిపోయి మృతి చెందాడు. ఆత్మహత్య, అనుమానస్పదంగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రాంతీయ వైద్యశాల తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## ముత్యాలమ్మ ఆలయంలో హుండి లెక్కింపు

చిల్లకూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త : మండల పరిధిలోని తూర్పు కనుపూర్ గ్రామంలో వెలసి ఉన్న శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం ఇన్స్పెక్టర్ ఎం సుధీర్ బాబు ఆధ్వర్యంలో 80 రోజులకి సంబంధించి హుండి లెక్కించగా 19,38,902 రూపాయలు వచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె నవీన్ కుమార్, సీనియర్ నాయకులు చిల్లకూరు దశరథ రామిరెడ్డి, సిబ్బంది సురేంద్రతో పాటు మరి కొంతమంది ఉన్నారు.

## అమ్మవారి సేవలో అక్కినేని నాగచైతన్య



**తిరుచానూరు, ఆగస్టు 21, ప్రభాతవార్త** తిరుచానూరు పద్మావతి అమ్మవారిని సినీ ప్రముఖుడు అక్కినేని నాగచైతన్య తన సతీమణి శోభితతో కలసి దర్శించుకు న్నారు. వారిని ఆలయ అధికారులు స్వాగతించి దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆశీర్వాదం మండపం వద్ద తీర్థప్రసాదల అందజేశారు. ఆలయం వెలుపల పెద్ద సంఖ్యలో స్థానికులు భక్తులు వారితో కలిసి ఫోటోలు తీసుకునెందుకు ఆసక్తి చూపారు.

## వేము ఇంజనీరింగ్ కళాశాలలో ఓరియంటేషన్



పూతలపట్టు, ఆగస్టు 21 ప్రభాతవార్త : పి. కొత్తకోట సమీపంలో వున్న వేము ఇంజనీరింగ్ కళాశాలలోని గురువారం మొదటి సంవత్సరం బిటెక్ విద్యార్థులకు, రెండవ రోజున ఘనంగా ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ విచ్చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. నవీన్ కిలారి మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆశయాన్ని సాధించడానికి, ఇది తొలి మెట్టు అన్నారు. విద్యార్థులు మ్యాథమ్యాటిక్స్ స్టాటిస్టిక్స్ పై పట్టు సాధించాలని, తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేకమైన శ్రద్ధను వుంచాలని కోరారు. స్కిల్ సెట్ ద్వారా వారు అనుకున్నది సాధించగలరని పేర్కొన్నారు.. కళాశాల ఛైర్మన్ డా. కె.చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా వుండాలని, మంచిగా మెలగాలని, సూచించారు. గొప్ప గొప్ప అంచనాతో జీవితాన్ని మారుస్తాయని, సంకల్పం గొప్పగా వుండే సాధించలేనిది ఏదీ లేదని అన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి సుమిత్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితానికి ఈ రోజు ఒక కొత్త ఆరంభం అవి, వారి మనసు ఎన్నో అలరిచనలతో నిండి వుంటుందని అన్నారు. ఈ రోజుల్లో యువత పక్కదారి పట్టడానికి, మొబైల్ ఫోన్లు కారణం అని అన్నారు. సోషియల్ మీడియా జీవితాలకు, నిజ జీవితాలకు చాలా వ్యత్యాసం వుందని, తల్లి దండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టిని పెట్టాలని, వారికి ఏమైన ప్రత్యేక మైన స్కిల్స్ ఉన్నాయా ? లేదా? అని గమనించాలన్నారు. కష్ట పడనిదే ఏదీ రాదని, ఆ కష్టానికి క్రమ శిక్షణ కూడా తోడయితే విజయం సాధించవచ్చని, వారి జీవితాలలోని గొప్ప స్థానాలను చేరవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ (అకడమిక్స్) డా.డి. చంద్రశేఖర్, వైస్ (పిన్సిపాల్ (అడ్మిన్) శిరీష హెచ్ఓఎస్, హెచ్ఒడి డా. యు. శశికళ, డీన్స్ వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పార్టీకి మరింత బలోపేతం కావాలి

**-జిల్లానేతలకు వర్లరామయ్య సూచన**



తిరుపతి,ఆగస్టు 21ప్రభాతవార్త: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెలుగుదేశంపార్టీ మరింత బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు కలసి పని చేయాలని, కష్టపడిన నాయకులకు గుర్తింపుతో పదవులు వస్తాయని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు వర్లరామయ్య సూచించారు. గత ఏడాది కాలంలో సిఎం చంద్రబాబు సొంత జిల్లాలో నాయకులు మరింతగా కష్టపడి పనిచేస్తున్నారని కితాబిచ్చారు. గురువారం విజయవాడలో రామయ్యను మర్యాద పూర్వకంగా రాష్ట్ర కార్యదర్శి సూరాసుధాకర్‌రెడ్డి, అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్‌బి సుధాకర్‌రెడ్డి తదితరులు కలిసి చర్చించారు.

# తిరుపతిలో వృద్ధురాలి దారుణ హత్య

**-కమ్మలకోసం పరిరక్షకుడే నేరస్తుడు**



తిరుపతి.ఆగస్టు 21ప్రభాతవార్త: నమ్మకంగా ఓ వృద్ధురాలి సంరక్షణ చూసుకుంటున్న సంరక్షకుడే దారుణంగా కత్తితో పొడిచి ఆమె ప్రాణాలు తీశాడు. ఈ సంఘటన గురువారం ఉదయం తిరుపతి నగరశివార్లలోని కొరమేనుగుంటలో జరిగింది. వృద్ధురాలి చెవులకు ఉన్న 10గ్రాముల బంగారుకమ్మలు లాక్కుని ఆపై కత్తితో పొడిచి హత్యచేసినట్లు అనుమానిస్తున్నారు. అలిపిరి సిఐ రామకిశోర్ వివరాల మేరకు...కొరమేనుగుంటలో సిపిఆర్ అర్బన్ అపార్టుమెంట్ 202 గదిలో ఎన్.ధనలక్ష్మి (73) నివాసముంటుంది. ఆమెకు తోడుగా బండ్లరవి అనే వ్యక్తి కేర్‌టేకర్‌గా ఉంటాడు. మృతురాలి కుమారుడు ఎన్.గణేశ్ సివిల్ ఇంజనీర్‌గా చెన్నైలో స్థిరపడ్డాడు. అతని తల్లికి తోడుగా మామ ఎస్‌డి షణ్ముగం ఉంటూ ఆమె బాగోగులు చూసుకుంటాడు.బుధవారం రాత్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆమెపై కేర్‌టేకర్ ఆమె మొఖంపై, గొంతుపై కత్తితో పొడిచి హతమార్చాడు. ఆపై ఆమె చెవుల్లోని జత బంగారు కమ్మలను దోపిడీచేసుకెళ్ళాడని ఫిర్యాదు. గురువారం ఉదయం తల్లి హత్యకు గురైనట్లు తెలుసుకున్న గణేశ్ తిరుపతికి చేరుకున్నాడు. కేర్‌టేకర్ పరారీలో ఉన్నాడు. మృతదదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ఎస్వీ వైద్యకళాశాలకు తరలించారు. అలిపిరి సిఐ రామకిశోర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.